## 5లక్షలు విలువచేసే ఎర్రదుంగలు స్వాధీనం



శ్రీకాళహస్తిరూరల్, మార్చి 26 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి నాగభూషణం ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి అటవీశాఖాధికారి లోకేష్, కృష్ణాపురం సెక్షన్ సిబ్బంది ఫీల్డ్ వాచర్స్‌తో కలసి బుధవారం ఉదయం పంగూరు హైవే వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపు ఒక రేనాల్ట్ వాహనం అధిక వేగంతో ప్రయాణిస్తుండగా అటవీశాఖ సిబ్బంది అడ్డుకునేందుకు ప్రయత్నించగా ఆగకుండా ఏర్పేడు వైపుకు దూసుకెళ్లింది. వెంబడించగా దుగ్గపేరి- నచ్చనేరి గ్రామల మధ్య హైవేపై సిల్వర్ రంగు డస్టర్ వాహనాన్ని వదిలేసినట్లు కనిపించింది. పరిశీలించగా అందులో 10 ఎర్రదుంగలు ఉన్నట్లు గుర్తించామని, వారి బరువు 296 కిలోలు ఉండగా రూ.5లక్షలు ఉండవచ్చన్నారు. దుంగలను వాహనంతో సహా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో కృష్ణాపురం డిఆర్ఓ సికిందర్, ఎఫ్‌బిఓ పి.పురుషోత్తం, ఏర్పేడు ఎఫ్‌బిఓ జి.శోభారాణి, వాచర్లు పి.పొన్నయ్య, జితేంద్ర, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## గంగమిట్టపై కొలువుదీరిన
# పోలేరమ్మ తల్లి





చిల్లకూరు, మార్చి 26, ప్రభాతవార్త

చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ, పోలేరమ్మ అమ్మవారి జాతరలో భాగంగా రెండవ రోజు బుధవారం వేకువజామున ఆనవాయితీగా వస్తున్న పోలేరమ్మ చరిత్ర కోట మండలం సిద్ధవరం గ్రామంలోని పుట్టినిల్లు అయిన కుమ్మరి ఇంటి వద్ద నుండి పోలేరమ్మ మట్టి ప్రతిమను చేసి మంగళవారం అర్ధరాత్రి కనుపూరు గ్రామంలోని బాలగురునాథ స్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చి ఒబ్బాయిమిట్ట వద్దకు తీసుకొచ్చిన అనంతరం ఘణాచ్చారి వారి గృహంలో ఉన్న అమ్మవారి ఆభరణాలకు పూజలు నిర్వహించి 101 రకాల నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి అక్కడ వసతులు సక్రమంగా లేదని అలిగి అలకలమిట్టకు వెళ్లారు. అప్పుడు గ్రామ పెద్దలు ఘణాచ్చారి మంగళవాయిద్యంతో, బాణాసంచాలు కాల్చుతూ పోలేరమ్మ అలక తీర్చి ఆభరణాలు అలంకరించిన అనంతరం దిష్టి తీర్పు తీర్చి పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ పొలిమేరలో ఘణాచ్చారి నడకోకల పైన ముందు నడుత్తూ వెనక ఓ వ్యక్తి అమ్మవారిని శిరస్సు పై పెట్టుకుని వచ్చారు. ఆ సమయంలో భక్తులు ఎదురు కుంభాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లలు లేని మహిళలు వరపడ్డారు. వారిని దాటుకుంటూ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలోకి దక్షిణ ద్వారం నుంచి లోపలికి వచ్చి అక్క అయినటువంటి ముత్యా లమ్మను పలకరించి ఉత్తర ద్వారం గుండా భయటికి వెళ్లి తూర్పు దిక్కున గంగమిట్ట వద్దకు తీసుకొచ్చి అక్కడ అమ్మవారికి కుంభం పోసి బలిగొర్రెను అమ్మవారికి చూపించి దిష్టి తీసిన తరువాత పోలేరమ్మను బుధవారం ఉదయం తాటి ఆకులతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడిసెలో కొలువు దీరింది. దీంతో జాతర ప్రారంభం కావడం జరిగింది. అదే విధంగా ము త్యాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ఉదయం పూలంకి సేవ విశేష పూల అలంకారం, సాయంత్రం గురునాథ స్వామి, అంకమ్మల గ్రామోత్సవం నిర్వహించారు. గొల్లోలు వీర కావళ్లు వేసుకుంటూ గ్రామంలో గ్రామోత్సవం నిర్వ హించారు. రాత్రి అమ్మవారికి రెండు తాటిచెట్ల మధ్య ఉయ్యాలను ఏర్పాటు చేసి ఘణాచ్చారి ఊపుతూ ఉయ్యాల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను గూడూరు డిఎస్పి గీతా కుమారి, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస రావు, ఇన్స్పెక్టర్ శ్రీనివాసుల బాబు, ఈఓ నవీన్ కుమార్, కమిటీ సభ్యులు చిల్లకూరు దశరధరామిరెడ్డి, సారంగం రమేష్, మారని సుబ్రమణ్యం పర్యవేక్షణలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసారు.

# సిఎం చంద్రబాబు తప్పక పథకాలు అమలు చేస్తారు

### ప్రజాసేవ చేసే కుటుంబం మాది - మహిళలు ఆర్థికంగా పైకి ఎదగాలి
### సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి





మహిళలతో ముఖాముఖిలో ప్రసంగిస్తున్న భువనేశ్వరి , మహిళలతో కోలాటం ఆడుతున్న భువనేశ్వరి

కుప్పం/గుడుపల్లె, మార్చి 26 ప్రభాతవార్త

ప్రజలకు ఇచ్చిన హామీలను, పథకాలను సిఎం చంద్రబాబు నాయుడు తప్పక అమలు చేస్తారని సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు గుడుపల్లె మండలం గుడి చెంబగిరి గ్రామంలో నారా భువనమ్మ మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. సిఎం చంద్రబాబు నాయకత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం ఉంచారని అది చాలా సంతోషాన్ని ఇస్తోందన్నారు. సిఎం చంద్రబాబు ఎన్నికల తర్వాత మాయం అయ్యే వ్యక్తి కాదని పేర్కొన్నారు. బాబు మరలా సిఎం కావడంతో పేదల కళ్లల్లో ఆనందం కన్పిస్తోందన్నారు. సిఎం చంద్రబాబు ప్రజల కోసమే పనిచేస్తారని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు తమ కుటుంబ సభ్యులు అని నారా భువనమ్మ పేర్కొన్నారు. కుప్పం ప్రజలను తాము ఎన్నటికీ మరువమని పేర్కొన్నారు. తమ కుటుంబం ప్రజల సొమ్ముపై ఆశపడే కుటుంబం కాదని తమది ప్రజాసేవ చేసే కుటుంబం అని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా పైకి ఎదగాలని సిఎం చంద్రబాబు ఆలోచన అన్నారు. కుప్పంలో మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో రైతులకు సుమారు 1500 గోకులంషెడ్లు మంజూరుతో పాటు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. గుడుపల్లె మండలంలో తాగునీటి సమస్య పరిష్కారంకు కొత్తగా 11 బోర్లు వేయడం జరిగిందన్నారు. అవసరం ఉన్న గ్రామాల్లో ట్యాంకర్లతో సరఫరాకు చర్యలు చేపట్టారన్నారు. కుప్పంలో ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సిఎం చంద్రబాబు ప్రజలకు అండగా ఉంటారన్నారు.

**మహిళలతో కలసి కోలాటం ఆడిన భువనమ్మ :**

గుడి చెంబగిరి గ్రామంలో నారా భువనమ్మ మహిళలతో కలసి ఉత్సాహంగా కోలాటం ఆడారు. ఈ సందర్భంగా నారా భువనమ్మకు గ్రామంలో మహిళలు మంగళహారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, సలహాదారు నరేష్‌చారి, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మండల పార్టీ అధ్యక్షుడు బాబునాయుడు, నేతలు హేమాంబర గౌడు, బేటప్పనాయుడు, సుబ్బు, ప్రశాంత్, మహిళా నేతలు అనసూయ, భాగ్యలక్ష్మి త్రిలోక్, సుగుణమ్మ, పద్మమ్మ, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హుండీల లెక్కింపులో మహిళ చేతివాటం

### రూ.లక్ష తస్కరించినట్లు గుర్తింపు: పోలీసులకు అప్పగింత



హుండీ లెక్కింపుల్లో దొంగతనం చేస్తూ పట్టుబడ్డ తిరుపతికి చెందిన లావణ్య

శ్రీకాళహస్తి, మార్చి 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెలకు, 20 రోజులకు ఒక మారు నిర్వహించే హుండీల లెక్కింపుల్లో పారదర్శకత కొరవడుతుంది. బుధవారం జరిగిన హుండీల లెక్కింపులో భ్రమరాంబ సేవా సమితికి సేవా భావంతో వచ్చిన ఓ మహిళ ఎంచక్కా రూ.లక్షకు పైగా తస్కరించినట్లు గుర్తించారు. ఆ మహిళను ఇఓ బాపిరెడ్డి ఆదేశాలతో పోలీసులకు అప్పగించారు. గతంలో కూడా హుండీల లెక్కింపుల్లో కొందరు సెక్యూరిటీ మరి కొన్నిసార్లు స్వీపర్లు, ఇంకొన్ని సార్లు సిబ్బందే శివయ్య హుండీల్లో చెయ్యి పెట్టి పట్టుబడ్డ సందర్భాలు లేక పోలేదు.

**వ్యవస్థ మారాలి:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నేటికి పురాతన కాలం నాటి హుండీల లెక్కింపు విధానాలనే అమలు చేస్తున్నారు. హుండీల లెక్కింపుకు సేవకులను, బయటి నుంచి వచ్చిన స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులకు అవకాశం కల్పిస్తున్నారు. అయితే బుధవారం జరిగిన లెక్కింపుల్లో సు మారు 300 మంది పాల్గొన్నట్లు స మాచారం. ఈనేపథ్యంలోనే తిరుపతి నుంచి భ్రమరాంబిక సేవా సమితి నుంచి పలువురు పాల్గొన్నారు. వారిలో 'లావణ్య' అనే మహిళ కూడా పాల్గొ న్నట్లు సమాచారం. బోజన విరామ సమయంలో బయటకు వెళుతున్న వారిని సెక్యూరిటీ చెక్ చేయటంతో హస్తలాఘవం గుట్టు బయట పడింది. లావణ్య వద్ద రూ.లక్షకు పైగా ఉన్నట్లు గుర్తించారు. లెక్కింపును సిసి కెమెరాల్లో గమనిస్తున్న ఆపరేటర్ లావణ్య శివయ్య సొమ్మును తస్కరించినట్లు గుర్తించి అధికారికి సమాచారం అందించారు. దాంతో వెంటనే ఆమెను మహిళా సెక్యూరిటీ, హోంగార్డులతో తనిఖీ చేయగా గుట్టురట్టు అయ్యింది.

**సిఐ వివరణ:**

హుండీల లెక్కింపుల్లో తన హస్తలాఘవం చూపిన తిరుపతికి చెందిన మహిళ లావణ్య భ్రమరాంబ స్వచ్ఛంద సేవా సంస్థ దారా సేవకురాలిగా వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయ ఇఓ టి. బాపిరెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేస్తున్నట్లు వివరించారు. రూ.98,500 స్వాధీనం చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

# అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తే రాష్ట్ర భవిష్యత్తు ఉజ్వలం

- టూరిజం అభివృద్ధితోనే సంపద సృష్టి
- కొత్త జిల్లాల్లోని జిల్లా అధికారులకు పూర్తి స్థాయి అధికారాలు
- కొత్త జిల్లాల కేంద్రాల్లో కనీసం మూడు హోటళ్ళు వుండేలా చర్యలు
- కలెక్టర్లకు సిఎం నారా చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం



చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:

జిల్లాల స్థాయిల్లో రూపొందించిన ప్రణాళికలను పక్కాగా అమలు చేస్తే రాష్ట్ర భవిష్యత్తు ఉజ్వలంగా వుంటుందని సిఎం నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. విజయవాడలో గురువారం 2వ రోజు జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సిఎం నారా చంద్రబాబునాయుడు జిల్లాల అభివృద్ధిపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సిఎం మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై రాష్ట్ర స్థాయిలో చర్చిస్తున్నామన్నారు. తాను 30 సంవత్సరాల క్రితం టూరిజంను ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తే ప్రతిపక్ష సభ్యులు అడ్డుకున్నారని, కమ్యూనిజం, క్యాపిటలిజం, సోషలిజం లేదు భవిష్యత్తు మొత్తం టూరిజందే అన్నప్పుడు తనపై కమ్యూనిస్టులు విరుచుకుపడ్డారన్నారు. పేదరికం నిర్మూలనకు సంపద సృష్టించే టూరిజం, తదితర అంశాలకే భవిష్యత్తు మొత్తం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో అర్థం చేసుకుని రియల్ టైమ్‌లో అమలు పరిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మన రాష్ట్రం ఐదు జోన్లుగా వున్నాయని, జోన్-4లో తిరుపతి వుందన్నారు. పవర్ హబ్‌ల ఆధారంగా ఆయా జోన్లలోని అన్ని జిల్లాలను అభివృద్ధి పరచేవిధంగా కలెక్టర్లు జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేస్త రాష్ట్ర భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందన్నారు. ప్రతి జిల్లాకు ఒక సీనియర్ అధికారిని ఇన్‌ఛార్జ్‌గా నియమించడం జరిగిందని, అలాగే ప్రతి జిల్లాకు ఇన్‌ఛార్జ్ మంత్రి వుంటారని వీరు కలిసి జిల్లాలు, ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో సమగ్రంగా చర్చించి క్షేత్ర స్థాయిలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వాస్తవ పరిస్థితులను తెలుసుకుని అందుకు తగ్గట్లుగా అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వాటిని రియల్ టైమ్‌లో పరిష్కరించడానికి రానున్న నెల నుండి సీనియర్ అధికారులందరు గ్రామాల్లో మూడు, నాలుగు రోజులు పర్యటించాలన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని అధికారులతో సంబంధం లేకుండా కొత్త జిల్లాల జిల్లా అధికారులకు పూర్తి స్థాయిలో అధికారాలు బదిలీ చేయాలని, ఆయా జిల్లాల్లోని అధికారులు స్వేచ్ఛగా వారి విధులను నిర్వర్తించడానికి అవకాశం కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్లు రెండు రోజుల్లో జారీ చేయాలన్నారు. అలాగే కొత్త జిల్లాలో ఎలాంటి సిబ్బంది సమస్య లేకుండా స్టాఫ్ రెగ్యులైజేషన్ చేపట్టాలని, పని ఒత్తిడికి తగ్గట్లుగా అధికారులు, సిబ్బందిని కేటాయించాలన్నారు. ప్రతి కొత్త జిల్లా హెడ్ క్వాటర్‌లో కనీసం మూడు హోటళ్ళు వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కొత్త జిల్లాల్లో మౌళిక వసతుల కల్పన అంశంపై సైతం అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సిఎం నారా చంద్రబాబునాయుడు కలెక్టర్లను ఆదేశించారు.

### జపాన్ పెట్టుబడులకు
# ఆంధ్రప్రదేశ్ కీలక గమ్యం

### - జపాన్ కనెక్ట్ విత్ ఆంధ్రప్రదేశ్ సెమినార్‌లో శ్రీసిటీ ఎండీ




సత్యవేడు, మార్చి 26 ప్రభాతవార్త:

భారతదేశంలోని జపాన్ రాయబారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి(ఈడీబీ), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్ఐసీసీఐ) సంయుక్తంగా, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంబంధాలు, విద్య, అంశాలపై నిర్వహించిన సెమినార్ బుధవారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం జపాన్-ఆంధ్రప్రదేశ్ మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి వేదికగా నిలిచింది. ఈ సదస్సులో భారతదేశంలో జపాన్ రాయబారి ఓనో కెయిచీ, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పాల్గొన్నారు. ఎఫ్ఐసీసీఐ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డా. గుణవీనా చద్దా సమన్వయం చేయగా, విశ్వ సముద్ర హోల్డింగ్స్ మేను ఫ్యాక్చరింగ్ సీఈవో జితేంద్ర నిమ్మగడ్డ అతిథులకు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి దార్శనిక నాయకత్వాన్ని ప్రశంసించిన రవీంద్ర సన్నారెడ్డి, జపాన్-భారత్ సంబంధాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న వ్యూహాత్మక నిర్ణయాలను, తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు.

# గాంధీపురంలో...గాడి తప్పిన పంచాయతీ పాలన

### -సర్పంచ్, కార్యధర్శికి మధ్య ఆధిపత్యపోరు, బలైతున్న సిబ్బంది
### -కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో విధులు బహిష్కరణ



తిరుపతిరూరల్, మార్చి26 ప్రభాతవార్త:

గాంధీపురం గ్రామ పంచాయతీలో పాలనా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. పంచాయతీలో కార్మికులకు గత రెండునెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో బుధవారం కార్మికులు విధులు బహిష్కరించి ధర్నాకు దిగారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు. పంచాయతీలో పనిచేసే కార్మికులకు జీతాలు చెల్లించాలని ఎంపిడిఓ, డిఎల్‌పిఓ, డి.పి.ఓ దగ్గరకు వెళ్ళి మొర పెట్టుకున్నా కార్మికులపై కరుణ కలగలేదు. పంచాయతీలో మరమ్మత్తుకు గురైన మోటర్లు రిపేర్లు చేయించకపోవడంతో నీటి కష్టాలు ప్రజలను వెంటాడుతున్నాయి. కార్మికులు విధులు బహిష్కరణతో పంచాయతీలో పారిశుధ్య పనులు పూర్తిగా స్తంభించిపోయ్యాయి. మండల స్థాయి అధికారి నుంచి జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్ళిన తమ గోడును పట్టించుకోవడం లేదని కార్మికులు వాపోతున్నారు. గాంధీపురం ఇన్‌చార్జి సర్పంచ్, పంచాయతీ కార్యధర్శి మధ్య ఆధిపత్యపోరు నడవడం వల్లే తమకు జీతాలు చెల్లించలేదని కార్మికులు వాపోతున్నారు.

తిరుపతిరూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీలో పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. పంచాయతీ కార్యధర్శి, సర్పంచ్ ఏకతాటిపై లేనందున ఏవరికి వారే యమునా తీరే లాగా తయారైంది. పంచాయతీలో పనిచేసే కార్మికులందరికి జీతాలు చెల్లించాలని సర్పంచ్ డిమాండ్ చేయగా...లేదు లేదు ఎంపిడిఓ సిఫారస్సు మేరకు 33 మందికి మాత్రమే జీతాలు చెల్లిస్తానని పంచాయతీ కార్యధర్శి భీష్మించుకుని కూర్చోవడంతో కార్మికులు జీతాలు అందక విలవిలలాడుతున్నారు. కనీసం గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు, డిజిల్, పాలనపరమైన ఖర్చులకైన బిల్లు పెట్టమని కోరినా పట్టించుకోవడం లేదని ఇన్‌చార్జి సర్పంచ్ వాపోతున్నారు. ఉన్నతాధికారులైన స్పందించి పంచాయతీలో సర్పంచ్, కార్యధర్శికి మధ్య ఉన్న గ్యాప్‌ను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్/వర్కర్స్ యూనియన్ (సి.ఐ.టియు) రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య, జిల్లా ప్రధాన కార్యధర్శి రాము, కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ బెట్టింగ్‌పై
## తక్షణ చర్యలు తీసుకోవాలి
### - తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి



వెంకటగిరి, మార్చి 26, ప్రభాతవార్త

ఆన్‌లైన్ బెట్టింగ్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి పార్లమెంట్ జీరో అవర్‌లో కోరారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా తిరుపతి ఎంపీ బుధవారం మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్. జూదయాప్‌లతో సమాజంలో ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతున్నాయ న్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు సులువుగా అందుబాటులోకి రావడంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆయన వాపోయారు. ముఖ్యంగా యువత భారీ మొత్తంలో డబ్బు పోగొట్టుకుంటూ తీవ్రంగా ప్రభావితం అవుతున్నారన్నారు. కొంత మంది విద్యార్థులు, ఉద్యోగస్తులు తమ సంపాదనను ఈ యాప్‌లలో పోగొట్టుకుని అప్పుల్లో కూరుకుపోతున్నారని పార్లమెంట్ దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. ఈ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా త్వరగా డబ్బు సంపాదించాలనే తలంపు చివరికి మోసాలు, దొంగతనాలు, ఇతర అక్రమ కార్యకలాపాలకు ప్రేరేపిస్తున్నాయని సభ దృష్టికి తీసుకెళ్లారు. యువత తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ బెట్టింగ్ యాప్‌లు మాఫియా గ్యాంగ్‌ల చేతుల్లో నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వ నియంత్రణను కూడా అధిగమించి తరచూ కొత్త పేర్లతో బెట్టింగ్ యాప్‌లు పునరావృతమవుతున్నాయని ఎంపీ గురుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, ఆన్‌లైన్ బెట్టింగ్, జూద యాప్‌లపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అంతేకాకుండా, సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి ఈ యాప్‌లను పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రజలకు ఆన్‌లైన్ బెట్టింగ్ నష్టాల గురించి అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

# రూ.26కోట్లతో పాత కాటేజీలకు మోక్షం !

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

కొండపై ఆరుదశాబ్దాల క్రిందట అప్పటి భక్తుల అవసరాలకు తగ్గట్లు నిర్మించిన పలు కాటేజీలు, విశ్రాంతి గృహాలు పురాతనమవడం, పెచ్చులూడిసీలింగ్‌లు ఊడిపోవడం, వర్షమొస్తే ధారాళంగా నీరు గదుల్లోకి చేరడం వంటి చేదు అనుభవాలు భక్తులు చవిచూస్తున్నారు. ఈ గదుల్లో దాదాపు నల్లులు, దోమలు, మంచాలు కూడా సరిగా లేకపోవడం అనే ఫిర్యాదులు భక్తుల నుండి వెల్లువెత్తుతున్నాయి. సామాన్యభక్తులకు వసతి కల్పించేందుకు వీలుగా ఎప్పుడోకొన్ని దశాబ్దాల క్రిందట నిర్మితమైన కేంద్రీయ విచారణ కార్యాలయం(సిఆర్ఓ)కు సమీపంలోనే ఉన్న సుదర్శన్, గోవర్ధన్, కల్యాణి సత్రాలు, సి టైప్‌క్వార్టర్స్, పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలో మ్యూజియం మార్గంలో కొన్ని విశ్రాంతి గృహాలు పూర్తిగా పాతవి కావడం, గోడలు, గదులు పెచ్చులూడే దుస్థితికి చేరాయి. ఈ విశ్రాంతి గృహాలు, కాటేజీలు పూర్తిగా సామాన్యభక్తులకు అందుబాటులో ఉండేవే. ఈ ప్రాంతాల్లో యాత్రికులు వాహనాల్లో చేరుకున్నా పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. కనీసం పార్కింగ్ అనేది లేకపోవడంతో యాత్రికులు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేసుకునే పరిస్థితి ఉంది. గదులు కూడా విశాలస్థలాలు లేవు. ఎప్పుడో పాతకాలంనాటి అవసరాలకు తగ్గట్లు, అప్పటి ప్రణాళికల మేరకు నిర్మించడంతో భవనాలు ఆందోళనకరంగా మారాయి. ఇందులో 50రూపాయలు, 100 రూపాయలు అద్దెగదులు భక్తులకు కేటాయిస్తారు. ఇవన్నీ కూడా ఉపయోగకరంగా లేకపోవడంతో ఆధునీకరించాలని నిర్ణయించారు. 1500గదులకు 26కోట్ల రూపాయలతో మోక్షం లభించనుంది. ముఖ్యులతోబాటు సామాన్యభక్తులు బసచేసే కాటేజీ, విశ్రాంతి గదులు ఎంబిసి పరిధిలో 683గదులు, సిఆర్ఓ, టిబి కౌంటర్‌ల పరిధిలో 6వేల వరకు గదులు ఉన్నాయి. వీటిలో ఆరేడు విశ్రాంతి




గృహాలు ఇప్పుడు భక్తులకు పూర్తిగా వినియోగించుకునే పరిస్థితిలో లేవు. సోమవారం టిటిడి బోర్డు కూడా ఆధునీకరణకు ఆమోదించింది.

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:** సిఎం సహాయన నిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు లబ్దిదారులకు అందజేశారు. లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ పరిధిలోను సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న ఆరు మందికి సిఎం సహాయ నిధి నుండి 5.34 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి. చిత్తూరు రూరల్ మండలం జంగాలపల్లికి చెందిన ఎస్.రమేష్‌కు రూ.2.33 లక్షలు, వెంకటాపురంకు చెందిన కేశవులునాయుడుకు రూ.75 వేలు, గుడిపాల మండలం పల్లూరుకు చెందిన అఖిల్‌కు రూ.1 లక్ష, శ్రీరంగంపల్లికి చెందిన జయచంద్రనాయుడుకు రూ.53 వేలు, చిత్తూరు అర్బన్‌కు చెందిన వి.నవీన్‌కుమార్‌కు రూ.52 వేలు, డి.రాజుకు రూ.19 వేలు చెక్కులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పంపిణీ చేశారు

## బంగారుపాళ్యం ఎస్ఐగా ప్రసాద్



***బంగారుపాళ్యం, మార్చి 26 ప్రభాతవార్త:*** బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా టి.ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు టుటౌన్ నుండి బదిలీపై బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా రోడ్డు భద్రత, రహదారి నిబంధనలను వాహనదారులు తప్పక పాటించాలని సూచించారు.

## నేడు బడ్జెట్ కౌన్సిల్ సమావేశం

**చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త: చిత్తూరు** నగర పాలక సంస్థ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం, అత్యవసర సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశభవనంలో నిర్వహిస్తున్నట్లు మేయర్ అముద ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు, కో-అప్షన్ సభ్యులు, నగర పాలక సంస్థ అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

## పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



**చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:** రంజాన్ నెల పురస్కరించుకుని బుధవారం నగరంలోని శేషాపిరాన్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ముస్లీం నేతలు బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ముత్తవల్లి హనీఫ్‌షా, ఇమామ్ అబ్దుల్ షుకూర్, కమిటీ సభ్యులు ఇలియాజ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## సికె బాబు ఇంట్లో దొంగతనం కేసు నిందితుడికి జైలు

***చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:*** చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సికె బాబు ఇంట్లో దొంగతనం చేసిన కేసులో నిందితుడు మహేష్(30)కి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ బుధవారం 5వ అదనపు సివిల్ జడ్జి, స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి పి.వెన్నెల తీర్పు వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే సికె బాబు నివాసంలో పనిమనిషిగా పని చేస్తున్న జి.మహేష్ ఓ రాత్రి ఎగ్జాస్ట్ సందు ద్వారా ఇంట్లోకి ప్రవేశించి రూ.1 క్షల దొంగనం చేసి పరారీ అయ్యాడు. ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే సికె బాబు సతీమణి సికె లావణ్యబాబు ఫిర్యాదు చేయడంతో అప్పటి క్రైమ్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం క్రైం స్టేషన్ ఇన్స్‌పెక్టర్ భాస్కర్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టి సాంకేతిక అధారాలను ఉపయోగించి నిందితుడు మహేష్‌ను గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కోర్టు విచారణలో నిందితుడిపై ఆరోపణలు రుజువు కావడంతో గురువారం జడ్జి పి.వెన్నెల నిందితుడికి మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

## కార్యకర్తలే అధినేతలు- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్

శ్రీరంగరాజపురం, మార్చి 26 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అధినేతలని, పార్టీ అభివృద్ధి కోసం అందరు కలసికట్టుగా పని చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రం శ్రీరంగరాజపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్‌నాయుడు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తాను ఎమ్మెల్యే అన్నారు. పార్టీలో విబేధాలు వున్నట్లైతే అది పార్టీని తీవ్రంగా నష్టం కలిగిస్తుందన్నారు. ప్రతిపక్ష వైకాపా నాయకులు తెలుగుదేశం పార్టీలో కలహాలు పెట్టి తాము లబ్ది పొందడానికి ప్రయత్నిస్తున్నారని దీనిని సమర్థవంతంగా ప్రతి కార్యకర్త గుర్తించి అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌కు 353 సమస్యలు

శ్రీరంగరాజపురం, మార్చి 26 ప్రభాతవార్త:



ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ గురువారం మండల కేంద్రం శ్రీరంగరాజపురంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజల నుండి సమస్యలపై 353 వినతిపత్రాలు అందాయి. ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ క్షేత్ర స్థాయిలో అధికారులు సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య, కార్వేటినగరం ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప, తహసిల్దారు లోకనాథపిళ్ళై, ఎంపిడిఓ మోహన్‌మురళీ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## బస్సు సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**పాలసముద్రం, మార్చి 26 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలం బలిజకండ్రిగ నుండి కర్నాటక రాష్ట్ర రాజధాని బెంగళూరు ఇట్టమదుగు వరకు తిరిగే రెండు ప్రైవేటు బస్సు సర్వీసులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విఎం థామస్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాలస ముద్రం మండలం నుండి కర్నాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో అత్యధికులు వుండటంతో అక్కడి నుండి పాలసముద్రం మండలానికి నేరుగా రావడానికి ప్రైవేటు బస్సులు ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. బెంగళూరు వెళ్ళే మండల ప్రజలు ఈ బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ ఒక బస్సును కొంత దూరం నడిపారు. పాలసముద్రం మండల తెలుగుదేశం నాయకులు, తదితరులు పాల్గొన్నారు. టపాకాయలు పడి కాలిన షామియానా ఎమ్మెల్యే థామస్ బస్సు సర్వీసులను ప్రారంభిం చడానికి వచ్చిన సవయంలో స్థానిక తెలుగుదేశం నాయకులు టపాకాయలు పేల్చడంలో అవి షామియా నాపై పడటంతో షామియానాకాలిపోయింది. ఒక్కసారిగామంటలుచెలరేగడంతోనాయ కులు, కార్యకర్తలు చెల్లచెదురయ్యారు.

## హోంమంత్రి జన్మదినం సందర్భంగా రోగులకు రొట్టెలు పంపిణీ

**తొట్టంబేడు, మార్చి 26 ప్రభాతవార్త** పట్టణంలోని ఎంఆర్‌పిఎస్ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు ఇర్లరాజ మాది ఆదేశల మేరకు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత జన్మదిన సందర్భంగా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రోగులకు మరియ గర్భిణీ స్త్రీలకు పండ్లు, బిస్కెట్లు, శీతలపానీయాలు అందజేశారు. అనంతరం సన్నిధి వీధిలోని అంబలిస్వామి ఆశ్రమంలో వృద్దులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ యువసేన అధ్యక్షులు మన్నేపల్లి ఈశ్వర్‌మాదిగ, పట్టణ యువసేత అధ్యక్షులు పాలూరు వెంకటమని మాదిగ పాల్గొన్నారు.

## పోషణ్‌భీ.. పడాయిభీపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



***గుడుపల్లె, మార్చి 26 ప్రభాతవార్త*** మండలంలోని గుత్తార్లపల్లి హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌భీ, పడాయిభీ అనే కార్యక్రమంపై సిడిపిఓ చంద్రకళ అధ ్వర్యంలో మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈసందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఆదేశాల మేరకు మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగుతోందన్నారు. వీటిని విధిగా వారికి అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. అలాగే మహిళలు విద్యపై ఆసక్తి చూపేలా వారికి అక్షరాస్యత కల్పించాలని సూచించారు. మూడుఏళ్లలోపు పిల్లలకు నవచేతన కార్యక్రమం, 3-6ఏళ్ల పిల్లలకు ఆదర్శిల కార్యక్రమంలో గురించి తొలిరోజు టివిలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా శిక్షణ కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుజాత, జయంతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిద్దప్పనూర్లులో తీరిన మంచినీటి సమస్య



కుప్పంరూరల్, మార్చి 26 ప్రభాతవార్త మండలంలోని కొటాలూరు పంచాయతీ సిద్ధప్పనూరులో నూతనంగా బోరు డ్రిల్ చేసి పైపులైను వేసి మంచినీటి సమస్య పరిష్కరించినట్లు సర్పంచ్ రాజేంద్రన్ తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ సూచనల మేరకు గ్రామంలో కొత్త బోరు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరాజులునాయుడు, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు పొన్నువేలు, ఐటిడిపి కార్తీక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



***శాంతిపురం, మార్చి 26 ప్రభాతవార్త*** వేసవి కాలంలో గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మండల సచివాలయంలో పంచాయతీ కార్య దర్శులు, ఇఎలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అవసరమైన తాగునీటి పనులను గ్రామాల్లో గుర్తించాలన్నారు. నీటి సమస్య ఉన్నచోట ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. అక్రమ కొళాయి కనెక్షన్లను పొందిన వారికి నోటీసులిచ్చి తొలగించాలనిఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ఎఇమనోజ్ఞ, ఇఒపిఆర్‌డి రవినాయక్, కార్యదర్శులు, ఇఎలు పాల్గొన్నారు.

## సిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం



కాణిపాకం, మార్చి 26 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు బుధవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు బెంగుళూరుకు చెందిన కాళీ చరణ్ బస్వా అనే భక్తుడు ఈపథకానికి 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ హరిమాధవరెడ్డి, సీఎఫ్ఓ నాగేశ్వరావు, సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## టెన్త్ ఫిజిక్స్ పరీక్షకు 248 విద్యార్థులు గైర్హాజరు

**చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:** జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన టెన్త్ ఫిజికల్ సైన్స్ పరీక్షకు 248 విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా గురువారం టెన్త్ ఫిజికల్ సైన్స్ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 21,143 మంది రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా 20,895 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. జిల్లా పరీక్షల పరిశీలకులు నాలుగు పరీక్షా కేంద్రాలు, జిల్లా రెవెన్యూ అధికారి ఒక పరీక్షా కేంద్రం, జిల్లా విద్యాశాఖ అధికారి మూడు, ఫ్లయింగ్ స్క్వాడ్ 19 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే జిల్లాలో ఏర్పాటు చేసిన 65 సిట్టింగ్ స్క్వాడ్‌లు 65 పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వర్తించారు.

## మహిళలకు ఆర్థిక పరిపుష్టికి



**యాదమరి, మార్చి 26 ప్రభాతవార్త:** మహిళా స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు ఆర్థికంగా పరిపుష్టి కావడానికి ప్రభుత్వం పక్కాగా సహకారం అందిస్తుందని ఈ సహకారంను సద్వినియోగం చేసుకుని మహిళలు ముందడుగు వేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి అన్నా రు. యాదమరి మండలం వరదరాజులపల్లి గ్రామంలో గురువారం జరిగిన శ్రీనివాస ఎస్ఎస్‌జి గ్రూపు సమావేశానికి డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి హాజరయ్యారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి సంఘ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ రానున్న సంవత్సరానికి సంఘ సభ్యుల అవసరాల మేరకు ఎంత రుణం అవసరం! సభ్యులు తీసుకున్న రుణంను ఏ విధమైన కార్యక్రమాలు చేపడితే ఆదాయం అభివృద్ధి అవుతుంది! సంఘ సభ్యుల పుస్తకాల నిర్వహణ ఎలా నిర్వహిస్తున్నారు! తదితర విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం మధు, ఎపిఎం ఈశ్వరి, వెలుగు సిసిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా ప్రజా సమస్యలు పరిష్కారం



***చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:*** ప్రజా సమస్యలను అధికారులు క్షేత్ర స్థాయిలో వేగంగా పరిశీలించి సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు ఆదేశించారు. చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడును కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరిం చారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, గుడిపాల తహసిల్దారు జయంతి, చిత్తూరు తహసిల్దారు లోకేశ్వరీ, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, మున్సిపల్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై తప్పనిసరి అవగాహన



***బంగారుపాళ్యం, మార్చి 26 ప్రభాతవార్త:*** యువతీ యువకులతో పాటు మహిళలు, బాలికలు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగివుండాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పద్మజ సూచించారు. బుధవారం సాయంత్రం సంక్రాంతిపల్లి సచివాలయంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం బంగారుపాళ్యం ఎస్‌సి బాలికల సంక్షేమ వసతిగృహంలో ఫోక్సో చట్టంపై విద్యార్థినిలకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి మాట్లాడుతూ ప్రతి మహిళ తమ పరిధిలో జరుగుతున్న న్యాయ పరమైన అంశాలపై అవగాహన కలిగి వుండాలని చెప్పారు. ఇందులో భాగంగానే జిల్లా న్యాయ సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక న్యాయ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశాల్లో 9వ అదనపు జడ్జి శ్రీనివాసరావు, 4వ అదనపు జడ్జి బాబునాయక్, ఎస్ఐ ప్రసాద్,

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పూతలపట్టు సంత వేలం ద్వారా పంచాయతీకి రూ. 22,49,000 ఆదాయం



పూతలపట్టు, మార్చి 26, ప్రభాతవార్త మేజర్ పంచాయతీ పూతలపట్టు మండల పరిధిలో దిన వారపు సంత బుధవారం నిర్వహించారు. బహిరంగ వేలం ద్వారా కాంప్లెక్స్ 11 రూములు 7,98,000 సంత 14,51,000 మొత్తం 22,49,000 ఆదాయం వచ్చినట్లు పూతలపట్టు సర్పంచి మసలమని, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. స్థానిక గుంటూరు మురళి సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగాఆనగళ్ళ మునిరత్నం మాట్లాడుతూ 1996లో గ్రామ పంచాయతీ కమర్షియల్ కాంప్లెక్స్ నందు 15 రిజర్వేషన్ క్రింద ఎస్సీ వర్గం వారికి దుకాణాలు కేటాయించాలని జీవో తెచ్చుకున్నారు. ఈ క్రమంలోనే ఎస్సీలకు రెండు దుకా ణాలు కేటాయించారు. అయితే ఈ దుకాణాలు గ్రామ పంచాయతీ పరిధిలోని వారికి గాక స్థానికేతురులు కైవసం చేసుకుంటున్నారు. స్థానికేతులైన వారు దుకాణాలు పొందగలిగితే రద్దుచేసి అర్హత కలిగిన స్థానికులకే అప్పగించాలని పంచాయతీ సెక్రెటరీని కోరారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణ మాట్లాడుతూ వివిధ వేలంపాట ద్వారా హక్కులను పొందినవారు వారం రోజులు లోపు వేలంలో పాడిన డబ్బులు మొత్తం చెల్లించి రసీదులు పొంది గుత్త వసూలు చేసుకోవాలని సూచించారు. చంద్రమోళి, ముత్తు, చిరంజీవి, పూతలపట్టు రైతులు పాల్గొన్నారు.

## వడదెబ్బ నివారణపై అవగాహన సదస్సు

సదుం, మార్చి 26, ప్రభాతవార్త



చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పాలమ మంద మాదిగపల్లి యందు డాక్టర్ గిరీషా ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వలన ప్రజలు ప్రధానంగా వృద్దులు, చిన్నపిల్లలు, ఉపాది పనులకు వెళ్లువారు జాగ్రత్తగా వుండవలెనని చెప్పారు., బయట పనులకు వెళ్ళువారు 11.00 లోపు పనులు పూర్తి చేసికోవాలన్నారు. వడదెబ్బ తగిలిన వారు విపరీతమైన తలనొప్పి, నీరసం, కళ్ళు తిరుగుట, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కలిగి ఉంటాయి అని నివారన కొరకు ఎక్కువగా నీళ్ళు తాగడం, పలచటి నూలు బట్టలు వాడడం, తల పై ఎండ తగలకుండా టవలు, టోపీ వంటివి వాడుకొనవలెనన్నారు. ప్రతి అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు వద్ద ఓ ఆర్ ఏస్ పాకెట్స్ అందుబాటులో వుండునని చెప్పారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులపై సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్. అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది ఉదయ్ భాస్కర్, నీలకంఠ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాఫీస, ఆరోగ్య కార్యకర్త ఓబులమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చౌడేపల్లి హెచ్‌డిటిగా నందినీదేవి



చౌడేపల్లి, మార్చి 26 ప్రభాతవార్త మండల హెడ్‌క్వార్టర్స్ డిప్యూటీ తహశీల్దార్‌గా నందినీదేవీ నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఇక్కడ పనిచేస్తున్న ఆర్‌ఎస్‌డిటి మాధవి మెటర్నటీ సెలవుపై వెళ్ళడంతో పలమనేరు ఆర్ఐగా వున్న నందినీదేవి పదోన్నతిపై చౌడేపల్లికి నియమితులయ్యారు. ఈమేరకు కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు.

## ఘనంగా శ్రీ అగ్నిమారెమ్మ కళ్యాణోత్సవం..అన్నదానం

కుప్పం, మార్చి 26 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి డికెపల్లి గ్రామదేవత శ్రీ ప్రసన్న అగ్నిమారెమ్మ జాతరలో భాగంగా బుధవారం అమ్మ వారి కళ్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అంత కుముందు అమ్మవారి ఉత్సవాన్ని ఊరేగించారు. ఆలయ ప్రాంగణం వద్ద సిద్ధప్ప, మణి కుటుంబీకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా గురువారం రథోత్సవం, శుక్రవారం అమ్మవారి పుష్పపల్లకి, బాణవేడుకలు జరుగుతాయని నిర్వాహకులు మాజీ సర్పంచ్ డికెపల్లి మణి తెలిపారు. కార్యక్రమంలో నేతలు సోమశేఖర్, పంచాయతీ టిడిపి అధ్యక్షుడు డివి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గోక్షేత్రంలో తాగునీటి బోరు ప్రారంభించిన భువనమ్మ



గుడుపల్లె, మార్చి 26 ప్రభాతవార్త మండలంలోని బిసానత్తం వద్ద ఉన్న గోక్షేత్రంలో నూతన తాగునీటిని బుధవారం ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనమ్మ ప్రారంభించారు. గతంలో నిజం గెలవాలి యాత్ర సందర్భంగా గోక్షేత్ర నిర్వాహకులు ఆవులకు నీటి సమస్య ఉందని నారా భువనమ్మ దృష్టికి తీసుకురావడంతో ఆమె నిధులు మంజూరు చేశారు. దీంతో నూతన బోరు డ్రిల్ చేయగా నీరు పుష్కలంగా లభించింది. దీంతో భువనమ్మ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ

రామకుప్పం, మార్చి 26 ప్రభాతవార్త



స్థానిక పశువైద్యశాలలో బుధవారం రైతులకు పశుగ్రాస విత్తనాలు రాయితీతో పంపిణీ చేశారు. మండలానికి ఎనిమిది టన్నుల మొక్కజొన్న, మూడు టన్నుల జొన్న విత్తనాలు వచ్చాయి. ఒక్కో పాసు పుస్తకంకు ఇరవై కిలోల విత్తనాలు అందించడం జరుగుతుందని డా॥ రవిశంకర్ తెలిపారు. మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు సీతాపతి, చిన్నికృష్ణ, పద్మనాభరెడ్డి, రామకృష్ణప్ప, వెంకటరమణ, బాలు పాల్గొన్నారు.

## 29న అరగొండ అపోలో ఆస్పత్రిలో ఉచిత వైద్యశిబిరం

తవణంపల్లె, మార్చి 26 ప్రభాతవార్త:

మండలంలోని అరగొండ అపోలో ఆస్ప త్రిలో ఈనెల 29న ఉచిత వైద్యశిభిరంను నిర్వహిస్తున్నట్లు ఆస్ప త్రి ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, పీఈఓ కమ్ముద్దీన్‌లు తెలిపారు. ప్రముఖ యూరాలజిస్ట్ మరియు సర్జన్‌చే ఈనెల 29న ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర భంగా కిడ్నీలో రాళ్ళుకు ఎండోస్కోపి ద్వారా ఆపరేషన్‌లు, కిడ్నీ క్యాన్సర్, కిడ్నీ వాపు, చిన్న పిల్లలలో ప్రోస్టేట్ క్యాన్సర్, యూరిన్ ఇన్‌పెక్షన్, మూత్రంలో రక్తం రావడం, మూత్రాశయానికి సంభందించిన అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## చిరస్మరణీయులు అన్నమాచార్యులు



**తిరుపతి(రవాణ), మార్చి 26ప్రభాతవార్త** తాళ్లపాక అన్నమాచార్యులు వేంకటేశ్వరస్వామిపై సంకీర్తనలను రచించి పాడిన తొలితెలుగు వాగ్గేయకారుడుగా చిర్మసరణీ యులని రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి కొనియాడారు. 522వ వర్ధంతిని బుధవారం రాయలసీమ కళాసంస్థ కళాకారులు జరుపుకున్నారు. అన్నమాచార్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. 32వేల సంకీర్తనలతో అర్చించిన మహానుభావుడ న్నారు. కలియుగం ఉన్నంతవరకు శ్రీనివాసుడిపై ఆయన రచించి ఆలపించిన కీర్తనలు ప్రతి ఇంటిలో వినిపిస్తూఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కళాకారులు చిగోరా చిత్తరపు హనుమంతరావు, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లారపు రవిప్రసాద్, జయంత్‌కుమార్, మల్లారపు వాసు, పురోహితుడు సురేష్‌స్వామి పాల్గొన్నారు.

## వేడుకగా అన్నమయ్య వర్ధంతి గోష్టి



తిరుపతి(రవాణ), మార్చి 26ప్రభాతవార్త పదకవితాపితామహుడుతాళ్ళపాకఅన్నమాచార్య వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం తిరుపతి లోని అన్నమాచార్యకళామందిరంలోగోష్టిగానంఅన్నమయ్య విగ్రహానికిఆయనవంశీకులు పుష్పాంజలి ఘటించారు

## జూనియర్ కళాశాల స్థలాన్ని కాపాడండి

**.తొట్టంబేడు, మార్చి 26 ప్రభాతవార్త** మహిళా జూనియర్ కళాశాల స్థలాన్ని కాపాడాలని కోరుతూ స్థానిక ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డికి పిడిఎస్‌యు విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షులు షేక్ జాకీర్ వినతిపత్రం అందించారు. ఏళ్ళ తరబడి ఉన్న కళాశాల స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, గతంలో ఉన్న ప్రిన్సిపల్ సుధాకర్ దీన్ని కాపాడడంతో చొరవతీసుకుని ఆక్రమణలకు గురికాకుండా చేశారని ఎంఎల్‌కు వివరించారు. ఈసందర్భంగా ఆయన ఎంఎల్ఏకు వివరిస్తూ ఈస్థలం మొత్తం కబ్జాకు గురికావడం జరిగిందని వెంటనే కాపాడాలని ప్రహరీగోడ నిర్మించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 2వేల మంది బాలికలతో విద్యాబ్యాసం జరుగుతోందని వారికి భద్రత కల్పించాలనికోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

## వంటావార్పుతో ఇంటి పట్టాల కోసం రిలే నిరాహారదీక్ష

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 26 ప్రభాతవార్త:

కనమనంబేడు గ్రామ దళితులు గత కొంత కాలంగా ఇంటి పట్టాల కోసం నిరాహారదీక్షలు సీపీఐ నాయకులు చిన్నిరాజా, కత్తి ధర్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం సీపీఐ జిల్లా నాయకులు మురళి ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలో భాగంగా 15 రోజు వంటావార్పు చేపట్టి రిలే నిరాహారదీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివసించడానికి నివాస స్థలాలు లేక కనమనంబేడు గ్రామ దళితులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇంటి స్థలాలు కేటాయించి పట్టాలు మంజూరు చేయాలని అనేక సార్లు మండల రెవెన్యూ అధికారులకు, జిల్లా కలెక్టర్ వారి పలు మార్లు వినతిపత్రాలు అందించారు. అధికారులు స్పందించకపోవడంతో సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి పట్టాల కోసం రిలే నిరాహారదీక్ష చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్నిరాజా, కత్తి ధర్మయ్య, కత్తి రవి, చింతపండు రమణయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా..ఎంఎల్ఏ



***.తొట్టంబేడు, మార్చి 26 ప్రభాతవార్త*** కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా తాను అండగా ఉంటానని ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. సమావేశానికి మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌రఎడ్డి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్‌రవి, తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలిమురళీనాయుడు, మాజీ పాలసరఫరా ఛైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎంఎల్ఏ తెలిపారు. కుటుంబ సాధికార సమితి సభ్యులను ఈనెలఖారులోగా నియమించాలని ఎంఎల్ఏ కోరారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తాను చక్కటి ప్రణాళికను రూపొందించామన్నారు. నియోజకవర్గంలో సమస్య ఉన్నా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం సభ్యత్వ నమోదుకు సంబంధించి కార్డులను పంపిణీచేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు

***.తొట్టంబేడు, మార్చి 26 ప్రభాతవార్త***

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని ఇసుకదిబ్బ ప్రాంతంలో ఓపెన్ బూజింగ్ జరుగుతున్నట్లు గుర్తించి అక్కడ ఉన్నటువంటి చట్టవ్యతిరేఖమైన కార్యకలాపాలు గుర్తించి అక్కడ ఉన్న చట్టవ్యతిరేఖ కార్యకలాపాలు పునరావృతం కాకుండా ఉండే విధంగా విజిబుల్ పోలిసింగ్ చేయడం జరిగిందని అర్బన్‌సిఐ డి.గోపి తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యంసేవించినా లేక ఇతర ఖాళీ ప్రదేశాల్లోమద్యంసేవించినా గుర్తించి డ్రోన్ కెమెరాలతో గుర్తించి వారికి శిక్షపడుతుందని లేదా రూ.10వేలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

## నల్లగంగమ్మ సేవలో ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి



.శ్రీకాళహస్తి, మార్చి 26 ప్రభాతవార్త పట్టణంలోని బహదూరుపేట తెట్టు వద్ద ఉన్న నల్లగంగమ్మ జాతర సందర్భంగా ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తి ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వరాలతో ఉండాలని కోరుకున్నట్లుతెలిపారు. అంతేకాకుండా అన్నదాతలు సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈఏడాది అమ్మవారికి మహిషాసురమర్ధిని అలంకరణ అద్భుతంగా చేపట్టారు. దాతల సహకారంతో అందించిన వెండి ఆభరణాలతో ఆలయంలో వెలసిన మూలవిరాట్టుకు అలరించడంతో ఆకట్టుకోవడంతో భక్తిభావం పెంపొందింది. కాగా ఉదయం నుంచి ఆమ్మవారి ఆలయం వద్ద జంతుబలులు చోటుచేసుకున్నాయి. కార్యక్రమంలో ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డితో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, నల్లగంగమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ కంటా రమేష్, మిన్నల్‌రవి, చెంచయ్యనాయుడు, మునిరాజయాదవ్, పేటబాలాజీరెడ్డి, గోపి, నెమళ్ళూరుసుబ్రమణ్యంలతో పాటు పలువురు ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్టును దర్శించుకున్నారు. కాగా ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

# తిరుపతి డివిజన్

## నేడు వైస్ ఎంపీపీ 2 ఎన్నిక

**విజయపురం, మార్చి 26 ప్రభాతవార్త:** విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు వైస్ఎంపీపీ 2 నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికకు కోరం అవసరం లేదని చేతులు ఎత్తి మద్దతు ద్వారా వైస్ ఎంపీపీ 2ను ఎన్నుకోవాలని తెలిపారు. కావున మండలంలోని ఎంపీటీసీలు ప్రతి ఒక్కరు తప్పక హాజరు కావాలని కోరారు.

## ఉపాధి నిధులు రికవరీ

విజయపురం, మార్చి 26 ప్రభాతవార్త:

మండల పరిధిలో 1.4.2023 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధిహామీ పనులకు రూ.7 కోట్ల 11 లక్షల 30 వేల 501లు ఖర్చు చేయగా అందులో 32 వేల 644 రికవరీ చేసినట్లు ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజేంద్ర తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సముదాయంలో 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ ఏ.రవికుమార్ ఆధ్వర్యంలో అన్ని పంచాయతీల్లో జరగగా అసిస్టెంట్ పీడీ సునీల్కుమార్,ప్రోగ్రాం అధికారి రాజేంద్ర, ఏపీవో జి.ఎస్.భవిత, జేఈ మధుబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పలువురు కూలీలు పాల్గొన్నారు.



## నారపరాజును పరామర్శించిన గాలి జగదీష్

***విజయపురం, మార్చి 26 ప్రభాతవార్త:*** మాజీ సింగిల్విండో అధ్యక్షుడు, వైసీపీ నాయకులు నారపరాజును పాతార్కాడులో బుధవారం స్వర్గీయ ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు తనయుడు గాలి జగదీష్ పరామర్శించారు. ఆయన కంటి శస్త్రచికిత్స చేసుకుని విశ్రాంతి తీసుకుంటుండడంతో పరామర్శించినట్టు తెలిపారు.

## ఎమ్మెల్యే చేతులు మీదుగా సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

విజయపురం, మార్చి 26 ప్రభాతవార్త:



సీఎం సహాయనిధిని చెక్కులను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం టీడీపీ పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. మండలంలోని మహారాజపురంకు చెందిన మునిరత్నంనాయుడుకు రూ.37,483లు చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, చిత్తూరు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## భారతీయ అంబేద్కర్ సేవ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మల్లె మొగ్గల ఉమాపతి

***తిరుపతి హెల్త్, మార్చి 26 ప్రభాతవార్త :*** భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా మల్లె మొగ్గల ఉమాపతిని ఎంపిక చేశారు. ఈ మేరకు బుధవారం కో-ఆపరేటివ్ హోటల్లో 46 మందితో రాష్ట్ర నూతన కమిటిని భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో బాస్ కేంద్ర కమిటి ప్రతినిధులు దుర్గ సుబ్బారావు, కె.వి రమణ పర్యవేక్షణలో బాస్ రాష్ట్ర నూతన కమిటిని ఎన్నుకున్నారని మల్లె మొగ్గల ఉమాపతి తెలిపారు. మల్లె మొగ్గల ఉమాపతి మాట్లాడుతూ రాష్ట్ర నూతన కమిటీలో నన్ను రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన బాస్ వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్కి కృతజ్ఞతలు తెలిపారు.



## వైభవంగా పేట గంగమ్మ జాతర

శ్రీకాళహస్తి,మార్చి 26 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో నాలుగు సార్లు జాతర్లను నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో బుధవారం బహదూరుపేట నల్లగంగమ్మ జాతర కన్నుల పండువగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి అలంకారం అద్భుతం అత్యద్భుతంగా ఆకట్టుకుంది. చలి కాలంలో ఏడు గంగమ్మల జాతర, తిరుపతి గంగమ్మ జాతరతో పాటు అగ్రహారం జాతర, తరువాత వేసవి కాలంలో పానగల్ జాతర, అలాగే బహదూరుపేట జాతరను నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో బహదూరుపేటలోని నల్లగంగమ్మ జాతరను యువకులు నిర్వహించారు.

***గ్రామోత్సవం:*** శ్రీకాళహస్తి పట్టణంలోని బహదూరుపేటలోని నల్లగంగమ్మ ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న జాతరకు ఎనలేని స్పందన ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచి జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. సుమారు 2కిలో మీటర్ల మేర విద్యుత్ దీపాల దేవుళ్ళు, విద్యుత్ దీపాల తోరణాలతో ముస్తాబు చేసారు.అర్ధరాత్రి దాటిన తరువాత అమ్మవారికి బలి ఇచ్చి గ్రామోత్సవం ప్రారంభించారు. గ్రామోత్సవం ఉదయం 9గంటల వరకు సాగి తరువాత స్థావరం వద్ద ప్రతిష్టించారు. అక్కడ నుంచి బహదూరుపేట చుట్టుపక్కల నుంచే కాకుండా పట్టణంలోని పలు ప్రాంతాలతకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా జంతుబలులు చోటు చేసుకుంది.ఇంటింటికి పొట్టేళ్ళు,కోళ్ళును బలి ఇచ్చారు.పలువురు అమ్మవారి స్థావరం వద్ద వేయికళ్ళదుత్తలతో మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుజరగకుండా డివైయస్పి నరసింహామూర్తి సారథ్యంలో టూ టౌన్ సిఐ వెంకటేశ్వర్లు సారథ్యంలో చక్కటి బందోబస్తును నిర్వహించారు. జాతర కమిటి అధ్యక్షులు కంఠారమేష్,వారి సహచరులు చక్కటి ఏర్పాట్లు చేసారు. అలంకారం ప్రతి ఒక్కరిని ఆకర్షించుకుంది.

## శివయ్య హుండీ రాబడి లెక్కింపు

శ్రీకాళహస్తి,మార్చి 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లతో పాటు పరివార దేవతల హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఒలు విద్యాసాగర్రెడ్డి,లోకేష్రెడ్డి, సూపరింటెండెంట్లు,సిబ్బంది ఆలయంలో పని చేసే సిబ్బందితో పాటు పలువురు స్వచ్ఛంద సేవా సంస్థలకు చెందిన సేవకులు పాల్గొన్నారు.



## పార్టీ అధ్యక్షుని కలసిన పఠాన్

శ్రీకాళహస్తి,మార్చి 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గ మైనారిటి అధ్యక్షుడుగా నియమించబడిన పఠాన్ ఫరీద్ఖాన్ బుధవారం తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డిని కలసి పుష్పగుచ్ఛం అందించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు 20వేల మంది ముస్లింలు ఉన్నారని వారికి వైయస్ జగన్మోహన్రెడ్డి అంటే ఎంతో ఇష్టమని వివరించారు. శ్రీకాళహస్తిలో మైనారిటి ముస్లింలకు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి ఎన్నో తాయిలాలు అందించారని వివరించారు. ఈ సందర్భంగా జగన్మోహన్రెడ్డి మాట్లాడుతూ మన పార్టీ ప్రతి ఒక్కరి సంక్షేమానికి ఎన్నో చేసాం.కానీ ప్రజా తీర్పును శిరసావహించాలన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆరాచకాలను జనాలకు చెప్పాలని సూచించారు. శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు



## క్రైస్తవుల ఆందోళన

శ్రీకాళహస్తి,మార్చి 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పాస్టర్స్ అసోసియేషన్ బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేసారు. రాజ మండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి దారుణ హత్యకు గురయ్యారన్నారు. దైవ జనులు మాట్లాడుతూ క్రైస్తవులు ఏ మతానికి ఏ వ్యక్తులకు వ్యతిరేకం కాదన్నారు.అలాగే ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేసారు. కొంత మంది మతోన్మాదులు కక్షగట్టి క్రైస్తవుల మీద తరచూ దాడులు జరుతున్నారని ధ్వజమెత్తారు.ఈ ఆందోళనలో పాస్టర్స్ సంఘాధ్యక్షుడు పాస్టర్ అంబ్రోస్, గౌరవాధ్యక్షులు పాస్టర్ సుందర్రాజ్,పాస్టర్ జీవమణి, ప్రధాన కార్యదర్శి పాస్టర్ రవి డ్యానీ,కోశాధికారి పాస్టర్ జోసేఫ్,పాస్టర్మణిబాబు, పాస్టర్ ఎలీషా, పాస్టర్ రఫాయిల్,పాస్టర్ భాస్కరరావు విజయకుమార్, ఆశీర్వాదం,పరమానందం, మోషే,కొండయ్య, నతనెల, ఇమ్మానియల్, లాజరస్, జాన్ పీటర్, రమేష్, రాజేంద్రన్ రాజన్న, జాకోబ్, ఎస్ఎల్సి పెద్దలు ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి ఏళ్ళ నాటి పురాతన శివాలయం పునర్నిర్మాణానికి స్వామి సూచన



***తొట్టంబేడు,మార్చి 26 ప్రభాతవార్త*** శ్రీకాళహస్తికి సుమారు 5 కిలో మీటర్ల దూరంలోని తంగేళ్ళ పాళెం గ్రామ సమీపంలో వెయ్యి ఏళ్ళ నాటి పురాతనమైన శివాలయం ఉండేది. దీనిని పరిశీలించుటకు మాజీ శాసనసభ్యుడు ఎస్సివి నాయుడు అభ్యర్థన మేరకు కంచికామకోటి పీఠాధిపతి శంకరవిజయేంద్ర స్వామి తన పరివారంతో తంగేళ్ళ పాళెంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్వామికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు ఘనస్వాగతం పలికారు. తంగేళ్ళ పాళెంకు సమీపంలోని ఓ గుట్ట మీద 1000 సంవత్సరాల నాటి సుధా సమేత శ్రీ నీలకంఠేశ్వరస్వామి ఆలయం ఉండేది. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని ఎంతోకాలంగా బాగు చేయుటకు శాసనసభ్యుడు ఎస్సివి నాయుడు ప్రయత్నించారు.దాంతో బుధవారం గ్రామానికి స్వామి పరివారంతో వచ్చారు.ఈ సందర్భంగా ఆలయం ఎదురుగా గోపూజలను నిర్వహించారు.తరువాత స్వామి మాట్లాడుతూ ఇక్కడ పురాతనమైన ఆలయాన్ని పునర్ నిర్మించటం ఎంతో శ్రేయస్కరం అని సలహా ఇచ్చారు.అంతేకాక స్వామి భూమి పూజలు జరిపారు. కొత్త ఆలయం నిర్మాణం కన్నా పురాతన ఆలయాన్ని పునర్ నిర్మించటమే శ్రేయస్కరం అన్నారు. అంతేకాక జీర్ణోద్ధారణ పూర్వ జన్మ పుణ్యఫలమన్నారు. ఈ సందర్భంగా స్వామిని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. అలాగే స్వామి మాజీ శాసనసభ్యుడు ఎస్సివి నాయుడును సత్కరించారు. ఈ కార్యక్రమాలను మాజీ శాసనసభ్యుడు ఎస్సివి నాయుడు ఏర్పాటు చేసారు.

## ఫోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

**.తొట్టంబేడు, మార్చి 26 ప్రభాతవార్త** ఫోక్సో చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్జడ్జి బేబిరాణి అన్నారు. హైకోర్టు మరియు 12వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా పట్టణంలోని దస్కూల్లో శ్రీకాళహస్తిసీనియర్ సివిల్జడ్జి బేబిరాణి ఆధ్వర్యంలో మరియుబాల్యవివాహాలపై నిర్మూలన చట్టంపై విద్యార్ధినీ విద్యార్ధులకు అవగాహన కల్పించారు. న్యాయమూర్తులు బేబిరాణి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఫోక్సో చట్టం 2012 గురించి అవగాహన కలిగి ఉండఆలని అలాగే ఫోక్సో చిన్నారులకు రక్షణ కలిగించే భారతీయ చట్టం అని తెలిపారు. అదేవిధంగా ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే 15100 నంబర్కు పోన్ చేయాలని తెలిపారు.

## ప్రఖ్యాత శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోండి



***తిరుపతి విద్య, మార్చి 26 ప్రభాత వార్త*** శాస్త్ర విజ్ఞానంతో ఎన్నో ఆవిష్కరణలతో సమాజ ఉన్నతి కోసం కృషి చేసిన శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు డీజీ రామ్మూర్తి కోరారు. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగంలో బుధవారం నిర్వహించిన డికాంటినమ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్రమశిక్షణతో ఎంచుకున్న రంగంలో నిరంతర సాధనతో ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు.ఏ రంగంలో రాణించినా,నైతిక విలువలు మరువరాదని అన్నారు. మరో అతిథి డాక్టర్ కుమార్ మాట్లాడుతూ ఎంతో విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీవితంలో నిత్య విద్యార్థిగా ఉండాలని సూచించారు. సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు, అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రగిరి బహిరంగ వేలం వాయిదా



చంద్రగిరి, మార్చి 26 ప్రభాతవార్త చంద్రగిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం వారపు సంతకు నిర్వహించిన బహిరంగ వేలం పాటను ఎంపిడిఓ వెంకటరత్నం నాయుడు రద్దు చేశారు. గడచిన 5 ఏళ్ళ కాలంలో చంద్రగిరి గ్రామ పంచాయతీలో వేలం ప్రక్రియ సజావుగా సాగలేదనే విమర్శలు వున్నాయి. కరోనా సమయంలో దాదాపు ఏడాది కాలం దుకాణాలు మూతపడినప్పటికీ గడువు కాలాన్ని పొడిగించి అద్దె వసూలు చేయడం పట్ల షాపుల నిర్వహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనేక పర్యాయాలు బహిరంగ వేలం, టెండర్ల నిర్వహణ చేపట్టదలచినప్పటికీ రాజకీయ కారణాలతో వాయిదా వేసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలోనే కొంత మంది వారపు సంత గేటు వసూలు చేసుకుని దిగమింగారనే ఆరోపణలు వున్నాయి. గతంలో టిడిపి నాయకుడు ఒకరు టెండరు దక్కించుకుని తన రాజకీయ పలుకుబడి, అధికారుల సహకారంతో ఇప్పటికీ కొంత బకాయిలు చెల్లించలేదని తెలిసింది. అదేవిధంగా 2024 సెప్టెంబర్ 28న నిర్వహించిన బహిరంగ వేలంలో సంతగేటును 6 నెలలకు రూ.14,61,000/-లు దక్కించుకున్న వేలందారుడు షణ్ముగ రెడ్డి ఇప్పటికీ కొంత బకాయిలు వున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వేలం పాటకు హాజరైన మనోహర్ రెడ్డి వర్సెస్ గురవారెడ్డి ఇరువురి నడుమ పోటీ రసవత్తరంగా సాగింది. ఇందులో మనోహర్ రెడ్డి రూ.28,07,000/-లకు పాడగా, గురవారెడ్డి రూ.28,09,000/-లు పాడారు. ఇదిలా వుండగానే ఎంపిడిఓ వేలంను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి వెళ్ళిపోయారు. బహిరంగ వేలను రద్దు చేయడంపై వైసిపి, టిడిపి నాయకులు, స్థానికులు భిన్నాభిప్రాయాలువ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే వెళ్ళడిస్తామని ఎంపిడిఓ అన్నారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

***చంద్రగిరి, మార్చి 26 ప్రభాతవార్త:*** చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయ ఈఓ కె.మమత మాట్లాడుతూ 2025 జనవరి 9 నుండి మార్చి 26 వరకు భక్తుల ద్వారా లభించిన హుండీ కానుకలను దేవాదాయ ధర్మాదాయ శాఖ తిరుపతి డివిజన్, తనిఖీదారు పి.ఫణిరాజశయన సమక్షంలో లెక్కించినట్లు వెళ్ళడించారు. ఇందులో నగదు రూపేణా రూ.6,21,058/-లు, బంగారు 28 గ్రాములు 600 మిల్లీ గ్రాములు, వెండి 218 గ్రాములు 350 మిల్లీ గ్రాములు ఆదాయంగా లభించినట్లు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా చెర్లోపల్లి శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో రూ.1,86,341/-లు నగదు కానుకలు లభించినట్లు తెలిపారు

## బ్యాడ్మింటన్ ఛాంపియన్ కెఎంఎం విద్యార్ది హోత్రిశ్రీ

సింగిల్స్, డబుల్స్లో హోత్రిశ్రీ అద్భుత ప్రదర్శన

కెఎంఎం కార్యదర్శి ఎస్.అరుణ్కుమార్



**చంద్రగిరి, మార్చి 26 ప్రభాతవార్త:** బ్యాడ్మింటన్ ఛాంపియన్గా కెఎంఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని టి.హోత్రిశ్రీ రాణించడం గర్వకారణమని కెఎంఎం కార్యదర్శి ఎస్.అరుణ్కుమార్ అన్నారు. కెఎంఎం కళాశాలలో బుధవారం హోత్రిశ్రీని పలువురు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జెఎన్టియుఎ అనంతపురం ఆధ్వర్యంలో జెఎన్టియు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కలికిరిలో జరిగిన 12వ ఇంటర్ కాలేజ్ గేమ్స్ మీట్ 2025 నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో కెఎంఎం విద్యార్థిని బ్యాడ్మింటన్ విభాగంలో సింగిల్స్, డబుల్స్ రెండిటింలోనూ అద్భుత ప్రదర్శన చేసినట్లు ఆయన అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సూరిబాబు, ఈసిఈ విభాగాధిపతి పి.అనూష, తదితరులు ఆమెను దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపికలను బహుకరించారు.

## కాళంగి రిజర్వాయర్, కళత్తూరు చెరువులను సందర్శించిన ఇరిగేషన్ ఎస్ఈ



**కేవీబీ పురం, మార్చి 26 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని కాళంగి రిజర్వాయర్, కళత్తూరు పెద్ద చెరువు రిజర్వాయర్, ఆరె జలాశయ చెరువుని, ఓలూరులోని రాయల చెరువు జలాశయాన్ని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్రావు, ఈఈలు మదన్గోపాల్, శివారెడ్డి, డీఈ, ఏఈలు సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి, కేవీబీ పురం మండల క్లస్టర్ ఇన్చార్జి ఎం.మునస్వామి యాదవ్, కాళంగి రిజర్వాయర్ చైర్మన్ రాజారెడ్డి, రాయల చెరువు చైర్మన్ బాబుశెట్టి, ఆరె రిజర్వాయర్ చైర్మన్ శివప్రసాద్, మాజీ చైర్మన్ ప్రకాష్నాయుడు, ఓలూరు సర్పంచ్ సురేష్చౌదరి, కేవీబీ పురం మండల యువ నాయకులు సాయికృష్ణచౌదరి, తిరుపతి పార్లమెంట్ పాలు ఏకరి సాధికారిక సమితి అధ్యక్షుడు వెంకటకృష్ణయ్య, ఆరె సర్పంచ్ దాము, ఆరె గ్రామ కమిటీ అధ్యక్షులు రాజారాం, యువ నాయకులు యూనిట్ ఇన్చార్జి రామునాయుడు, మునిరత్నం, అఖిల్, బాలు, కేవీబీ పురం మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శక్తి యాప్ మహిళలకు బాడీగార్డ్

రేణిగుంట మార్చి 26 ప్రభాతవార్త




రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన శక్తి యాప్ మహిళలకు బాడీగార్డ్ లాంటిదని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ శరత్ చంద్ర, అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి సంయుక్తంగా అన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట మండలం కరకంబాడి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కళాశాల మహిళ విద్యార్థులకు అర్బన్ పోలీసులు కళాశాల ప్రిన్సిపల్ నాదముని రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సందర్భంగా పోలీసు అధికారులు విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మహిళల రక్షణ, శక్తి యాప్ లపై డిజిటల్ స్క్రీన్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతిలో ట్రాన్స్ ఫర్మేటివ్ ప్రాజెక్ట్ ను ప్రారంభించిన డిబిఆర్సి

తిరుపతి విద్య, మార్చి 26 ప్రభాత వార్త

టెట్రా ప్యాక్ సహకారంతో దళిత్ బహుజన్ రిసోర్స్ సెంటర్ ( డిబిఆర్సి ) ట్రాన్స్ ఫార్మేటివ్ ప్రాజెక్ట్ ను తిరుపతిలో ప్రారంభించింది.వ్యర్థాలు ఏరుకునే ప్రజల ఉన్నతి లక్ష్యంగా ప్రారంభించబడిన ఒక కొత్త కార్యక్రమం. అవసరమైన సేవలను పరిమితంగా మాత్రమే పొందుతున్నారని పివిఆర్ సీఈవో కమలేష్ ఖోలియా,దేవ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ శామ్యూల్ అనిల్ కుమార్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వ్యర్థాలను ఏరుకునేవారి ప్రాథమిక జీవనోపాధిని శక్తివంతం చేయడానికి ట్రైసైకిల్స్ కేటాయించడం,ప్రత్యామ్నాయ ఆదాయంఉత్పన్నం చేసే కార్యకలాపాలను మద్దతు చేయడానికి పుష్ కార్ట్స్ కేటాయించడం,సంపాదనలు, సామర్థ్యాన్ని పెంచడం.పిల్లలకు విద్యాపరమైన మద్దతు పిల్లలకు జీవన నైపుణ్యాలు కలిగించడం,సానుకూలమైన అలవాట్లు కలిగించడం,వారిని అధికారిక విద్యలోకి చేర్చుకోవడం వంటివి చేయడానికి అవుట్ డోర్ లెర్నింగ్ సెంటర్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు.

## ఎస్వీబీసీ ఉద్యోగిని పరామర్శించిన సినీ నటుడు సుమన్



తిరుపతి విద్య మార్చి 26 ప్రభాత వార్త

తిరుపతిలో 1987 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల పూర్వ సర్వ సమ్మేళనంకు వచ్చిన ఎస్వీబీసీ ఉద్యోగి గిరివర్ధనబాబు తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది.ప్రమాదంలో గాయాలతో స్విమ్స్ ఆసుపత్రిలో చేరారు. తిరుపతికి వచ్చిన సినీ నటుడు సుమన్ స్విమ్స్ లో చికిత్స పొందుతున్న గిరివర్ధనబాబు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,వారు వెంటనే కోలుకోవాలని ఆశీర్వదించారు.సుమన్ వెంట బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఉన్నారు.

## డిజిటల్ లిటరసీ, సైబర్ క్రైం పై అవగాహన

రేణిగుంట, మార్చి 26 ప్రభాతవార్త : డిజిటల్ లిటరసీ, సైబర్ క్రైం పై అవగాహన కార్యక్రమం బుధవారం ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ సీఎం,సీఎస్ కంప్యూటర్ సైన్సు విభాగం, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రేణిగుంట మండలంలోని జేపీ హై స్కూల్ ఆర్ మల్లవరంలో 8వ తరగతి, 9వ తరగతి విద్యార్థుల మధ్య జరిగింది. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ సీఎం, సీఎస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పీవీ నరసయ్య ముఖ్య అతిథిగా హాజరై మొబైల్ వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. అలాగే కంప్యూటర్ సైన్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ అంజన్ బాబు,ఇతర అధ్యాపకులు ప్రొఫెసర్ విజయలక్ష్మి, డాక్టర్ ఎం. శ్రీదేవి, ఎం. యశ్వంత్ కుమార్, డాక్టర్ ఎ. మల్లికార్జున, ఎంసీఏ డిపార్ట్మెంట్ విద్యార్థినీ, విద్యార్థులు వారి అనుభవాలను పంచుకున్నారు.

## ఎస్ఐని సన్మానించిన వైసీపీ నాయకులు

విజయపురం, మార్చి 26 ప్రభాతవార్త:

విజయపురం ఎస్ఐగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన రంగాను బుధవారం స్థానిక పోలీస్స్టేషన్లో వైసీపీ నాయకులు శాలువ కప్పి అభినందించారు. వైస్ ఎంపీపీ మంజు బాలాజీ, మండల కన్వీనర్ శివరాజు, మం డల యూత్ నాయకుడు సతీష్యాదవ్, సర్పంచ్ కుమార్, జిల్లుదాసు తదితరులు ఉన్నారు.

## శ్రీవాణికి సీఐటీయూ ఘననివాళులు

సత్యవేడు, మార్చి 26 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పని చేస్తూ ఇటీవల మృతి చెందిన అంగన్వాడీ కార్యకర్త శ్రీవాణికి సీఐటీయూ నేతలు ఘన నివాళులర్పించారు. బుధవారం సత్యవేడు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెలుగు రమేష్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్, తదితరులు అంగన్వాడీ కార్యకర్త శ్రీవాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కాంతమ్మ, భారతి, అనురాధ,భువన, నాగరాజు, మంజుల, చందామరి, మంజుల, దీప, సువర్ణ, శాంతి, రాణి పాల్గొన్నారు.

## పిడతల కోన ఆయకట్టు చైర్మన్ మృతి



***వడమాలపేట, మార్చి 26 ప్రభాతవార్త:*** పిడతలకోన ఆయకట్టు చైర్మన్ సోమశేఖర్రెడ్డి(61) అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని బంగారెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు సోమశేఖర్రెడ్డిఅనారోగ్యంతో గత 15 రోజులుగా వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సోమశేఖర్రెడ్డి సీతారామపురం సర్పంచ్గా వాటర్షెడ్డు చైర్మన్గా, వైస్ ఎంపీపీగా పని చేశారు. ఆయన మృతికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ సీనియర్ నాయకుడు సోమశేఖర్రెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. టీడీపీ నాయకులు ధనంజయలునాయుడు, దేవా, వెంకటయ్య, హేమాద్రినాయుడు, తిలక్రెడ్డి, హేమావతి తదితరులు సంతాపం తెలిపారు. గురువారం దహనక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ సభ



***వడమాలపేట, మార్చి 26 ప్రభాతవార్త:*** ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక వడమాలపేటలో బుధవారం తూతూ మంత్రంగా జరిగింది. సిబ్బంది తప్ప జనంగాన్ని, ప్రజాప్రతినిధులు కాని ప్రజావేదికలో పాల్గొనకపోవడం విశేషం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 754పనులుగాను రూ. 9.85 కోట్లు ఖర్చు చేయగా రూపాలు అవినీతి జరిగినట్లు తేల్చి రికవరీకి ఆదేశించారు. వడమాలపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో 20 పంచాయతీల్లో 17వ విడత జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసి తమ నివేదికలను చదివి వినిపించారు. మండలంలో 754 ఉపాధి పనులగాను రూ.9.85 కోట్లు ఖర్చు చేశారు. అందులో కేవలం రూ.1000 అవినీతి జరిగినట్టు తేల్చారు. దీంతో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ రికవరీకి ఆదేశించారు. ఎంపీడీవో శేషగిరిరావు, ఏపీడీ వరప్రసాద్,ఏపీవో గణేష్, శ్రీనివాస్, సుజాత, హంసవేణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



## నేడే తిరుపతిరూరల్ ఎంపిపి ఉప ఎన్నిక

తిరుపతిరూరల్, మార్చి26 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండల ప్రజా పరిషత్ అధ్యక్ష ఉప ఎన్నికకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ జుబేద తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళి మేరకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎంపిపి ఉప ఎన్నికను పారదర్శంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం12 గంటల వరకు ఎంపిపి ఉప ఎన్నిక ఉంటుందని, కోరం ఉంటేనే సమావేశం నిర్వహించి ఎంపిపి ఉప ఎన్నిక ఉంటుందని, కోరం లేకపోతే ఎంపిపి ఉప ఎన్నిక వాయిదా వేయబడునని తెలిపారు. ఎంపిపి ఉప ఎన్నికలో ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీలు పాల్గొన్న, ఎంపిటిసి సభ్యుల ఓట్లుతోనే ఎంపిపిని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నియమావళి మేరకు ఉప ఎన్నిక నేపథ్యంలో గురువారం ఉదయం నుండి 163 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎన్నిక కేంద్రం నుండి 100 మీటర్లు వరకు ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించరాదని సూచించారు. బుధవారం ఉదయం ఎఎస్పీ రవిమనోహరాచ్చారి, డియస్పీ శ్రీలతలు యంఆర్ పల్లి ప్రధాన రహదారి, పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రిసైడింగ్ అధికారి రామచంద్ర పాల్గొన్నారు.

## మీ కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తా

-పార్టీ కోసం పనిచేసినవారందరికి మంచిరోజులు

-ప్రజాదర్బార్లో ఎమ్మెల్యే నాని




***తిరుపతిరూరల్, మార్చి 26 ప్రభాతవార్త:*** చంద్రగిరి నియోజకవర్గ ప్రజలందరి కుటుంబ సభ్యుడిగా ఉంటూ ప్రజాపాలన అందిస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చి కేవలం 9నెలలు కాలమే అయిందని, మరో 9సంవత్సరాలు పాటు ప్రభుత్వం ఉంటుందని, పార్టీ కోసం కష్టించి పనిచేసివారందరి గుర్తింపు ఉంటుందని, ఎవరు అసంతృప్తి చెందవద్దని సూచించారు. బుధవారం రఘనాథ్ రిసార్ట్స్లోని పార్టీ సమావేశ మందిరములో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతం వైసిపి దురాగతాలు వల్ల టిడిపి శ్రేణులు ఇబ్బందులు పడ్డారని, ఇకపై ఏఒక్కరూ ఇబ్బంది పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గంలో దాదాపు 60కోట్ల రుపాయాలతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. తిరుపతిరూరల్లో కొట్టుకుపోయిన చిగురువాడ, తనపల్లి, తిరుచానూరు బ్రిడ్జిలను నిర్మిస్తానని తెలిపారు. బ్రిడ్జిల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్, మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్రెడ్డి తన ఎదుగుదలతో పాటు కుటుంబ సభ్యుల ఆర్థిక ఎదుగుదల చూసారే తప్ప, వైసిపి నాయకులను కూడా పట్టించుకోలేదన్నారు. ఇసుక, గుల్ల, మట్టి మాఫీయా చేసింది చెవిరెడ్డి తమ్ముడి కాదా అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో అబద్దపు ప్రచారం చేయించడంలో చెవిరెడ్డి దిట్ట అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, అలిమినేని మధు, మధుశేఖర్, బడి సుధాయాదవ్, సుబ్రమణ్యంనాయుడు, కృష్ణమూర్తిరెడ్డి, నాగూరు శ్రీనివాసులు, ఆరు మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి.

***తిరుపతి విద్య, మార్చి 26 ప్రభాత వార్త*** హైదరాబాద్కు చెందిన క్రైస్తవ మతబోధకుడు, డిబేటర్,యూట్యూబర్ పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద స్థితిలో మరణించడం సంచలనం సృష్టించింది అని ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ అన్నారు.మంగళవారం తూర్పు గోదావరి జిల్లా, రాజానగరం మండలం, దివాన్ చెరువు వద్ద ఆయన మృతదేహం కనుగొనబడింది అని అన్నారు.పోలీసుల ప్రాథమిక నివేదిక ప్రకారం,ప్రయాణిస్తున్న సమయంలో ఓ కారు ఓవర్టేక్ చేసినపుడు పెద్దగా పొగలు వచ్చాయని,అనంతరం ఆయన బైక్పై నుంచి పడిపోయి మరణించినట్లు వెల్లడించారు.అయితే, మృతదేహాన్ని పరిశీలించిన ప్రతినిధులు అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. హెల్మెట్ ధరించినప్పటికీ తల గాయపడడం, ముఖంపై కొట్టినట్లు గుర్తులు ఉండడం, మరణించడానికి ముందు ఆయనకు ప్రాణహాని ఉందని స్వయంగా ఓ వీడియోలో వెల్లడించడం వంటి అంశాలు అనుమానాలకు తావిస్తున్నాయి అని అన్నారు. ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి నిజాలను వెలుగులోకి తేవాలి అని డిమాండ్ చేశారు.

## 141 మంది విద్యార్థులకు స్కాలర్షిప్లు

***తిరుపతి విద్య, మార్చి 26 ప్రభాత వార్త*** మహిళా సాధికారత కోసం తమ దారిణీకతను బలోపేతం చేస్తూ 141 మంది బాలికలకు 13,04,000 రూపాయలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని బాలికల కోసం విద్యా సాలర్షిప్లను పంపిణీ చేసింది.ఈ ప్రోగ్రాం బాలికల విద్యకు మద్దతు ఇవ్వడంలో మలబార్ గ్రూపు యొక్కని బద్ధతను నొక్కిచెబుతుంది.ఈ కార్యక్రమాన్ని బుధవారం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం నందు తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్ మౌర్య, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షో రూమ్ హెడ్ కె రిజేష్ విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లు, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యొక్క ఇతర మేనేజ్ మెంట్ టీమ్ సభ్యులు,కష్టమర్లు, శ్రేయోభిలాషులు మరియు విదార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొనారు.



## ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయండి

తిరుపతి విద్య, మార్చి 26 ప్రభాతవార్త



ఎస్వీ వర్సిటీలో ఉచితంగా డీఎస్సీ కోచింగ్ సెంటర్ను, ఏర్పాటు చేసి విద్యార్థులకు కోచింగ్ తీసుకొనుటకు అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అఖిలపక్ష విద్యార్థి సంఘం నాయకులు బుధవారం వైస్ ఛాన్సలర్ అప్పారావుని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ మాట్లా దుతూ యూనివర్సిటీలో ఆర్థికంగా వెనుకబడినటువంటి పేద విద్యార్థులు డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతు న్నారని వారందరూ కూడా బయట కోచింగ్ సెంటర్లో వేలాది రూపాయలు వెచ్చించి చదువుకో లేరని,వారికోసం యూనివర్సిటీలో గతంలో మాదిరి గా, యూనివర్సిటీ నిధులతో వారికి ఒక కోచింగ్ ఏర్పాటుచేసిడి ఎస్సీశిక్షణ ఇవ్వగలిగితే వారిజీవితాలకుఎంతోఉపయోగపడుతుందనిచెప్పారు. మురళీకృష్ణ, సుధాకర్మాదిగ,లోకేష్, తిరుమలేష్, జెడిప్రసాద్,పవన్కుమార్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని సమర్ధవంతంగా చేపట్టాలి

కల్లూరు, మార్చి 26, ప్రభాతవార్త

కూలీలు రైతుల సహకారంతో ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా చేపట్టి అందరికీ ఆదర్శంగా ఉండేలా పనులు చేయాలని ఏపీవో సౌభాగ్యవతి అన్నారు. పులిచెర్ల ఉపాధి హామీ పథకం ఏపీఓగా సౌభాగ్యవతి బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి బుధవారం ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమావేశంలో టిఏలు జ్యోతి రెడ్డి, కీర్తి, సుభాషిణి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మను దర్శించుకున్న ప్రముఖులు



చిల్లకూరు, మార్చి 26 ప్రభాతవార్త : తూర్పు కనుపూరు గ్రామంలో వెలసి ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో బుధవారం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త తానంకి నానాజీలతో కలిసి ముత్యాలమ్మ, పోలేరమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందుగా వీరు రాకతో ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ అమ్మవారిని దర్శించుకుంది. ఆమెకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శినం కల్పించి, తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సహకారంతో రెండు రోజుల పాటు నిర్వహించిన టోర్నమెంట్ పోటీలు యువతను ఎంతగానో ఉత్సాహ పరిచింది. తూర్పు కనుపూరు గ్రామంలో ఇప్పటి వరకు జాతర సమయంలో క్రీడా పోటీలు నిర్వహించలేదని ఈ ఏడాది ఎమ్మెల్యే యువతకు పోటీలు నిర్వహించడం సంతోషదాయకమని వారు తెలిపారు. అదే విధంగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చిల్లకూరు పట్టాభిరెడ్డి, ఇఓ నవీన్ కుమార్, కమిటీ సభ్యులు చిల్లకూరు దశరథ రామిరెడ్డిరెడ్డి, మారని సుబ్రమణ్యం, సారంగం రమేష్, ఒబ్బాయి శివకుమార్, దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## వడ దెబ్బ జాగ్రతలపై అవగహన

వెంకటగిరిరూరల్ మార్చి 26 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ప్రజలు వడ దెబ్బ బారిన పడే ఆవకాశం ఉండటంతో జిల్లా ఉన్నతాధికారుల సహాలు సూచనుల మేరకు డాక్టర్ పి.గోపాల్ వడ దెబ్బ తగలకుండా తీసుకోవాలి్స జాగ్రతలు తెలియజేశారు. వడదెబ్బ తగిలిన వారికి ఉండే లక్షణాలు చర్మం ఎర్రగా వేడిగా పొడిగా ఉండటం,నోరు ఎండిపోవడం, బాగా నిరసించిపోవడం ముత్రము తక్కువగా వేడిగా రావడం కాళ్ళు చేతులు బాగా లాగడం స్పృహ కొల్పోవడం అలస్యం చేస్తే ప్రాణాపాయం కలగడం జరుగుతుందని వివరించారు. ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాలల్లో రైల్వే స్టేషన్‌లల్లో అర్‌టిసీ బస్టాండ్ తదితర ప్రాంతాలల్లో ప్రజలకు ఉచితంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణి చేసేవిందగా ప్రభుత్వం సూచనలు ఇవ్వాలని తెలియజేశారు.

## పరామర్శించిన నేదురుమల్లి



వాకాడు, మార్చి 26 ప్రభాతవార్త: వాకాడులో మసీదు వీధికి చెందిన వైకాపా సీనియర్ నేత గౌసు ముహుద్దీన్ సతీమణి ఇటీవల హనీఫా మృతి చెందడంతో బుధవారం గౌస్ మొహిద్దిన్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను రామ్ కుమార్ రెడ్డి పరామర్శించారు, గౌస్‌ని పరామర్శించి ధైర్యాన్ని నింపారు. తాను గౌస్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వాకాడు ఉప సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, తిరుపతి జిల్లా వైకాపా అధికార ప్రతినిధి దామోదర్‌రెడ్డి, సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు సుధాకర్ నాయుడు, నాగూర్‌రెడ్డి, శేషు రెడ్డి, నేదురుమల్లి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు పెంచల్‌రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, వాకాటి రవికుమార్ తదితరులు ఉన్నారు.

## మండల పరిషత్‌లో చలివేంద్రం ఏర్పాటు

వాకాడు, మార్చి 26 ప్రభాతవార్త: మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని బుధవారం ఎంపీడీవో శ్రీనివాసులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రత ఎక్కువవడంతో మండల పరిషత్ కార్యాలయంకి వచ్చే టువంటి ప్రజల కోసం చలివేందర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.ప్రతిరోజు కూలింగ్ మంచినీరు ఉంటుందని దాహంను ప్రజలకు తీర్చేందుకే చలివేంద్రం పెట్టడం జరిగిందన్నారు. ఆయన వెంట ఈ ఓ పి ఆర్ డి ఉమామహేశ్వరరావు, మండల పరిషత్ సిబ్బంది, స్థానిక ప్రజలు ఉన్నారు.

## జాతరలో ఆటో చోరీ... పర్సు పోగొట్టుకున్న మహిళ

చిల్లకూరు, మార్చి 26 ప్రభాతవార్త : ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో అమ్మవారిని దర్శించుకునేందుకు తోటపల్లి గూడూరుకు చెందిన కె.విజయ కుమార్‌తో పాటుగా కొందరు భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చారు. వాహనాలు పార్కింగ్ వద్ద ఆటో నిలిపి దర్శనం చేసుకుని తిరిగి వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను అపహరించారు. అదే విధంగా ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు నాయుడుపేటకు చెందిన మహిళలు క్యూలైన్‌లో వస్తుండగా పర్సు పడిపోయింది. పర్సులో ఏడు వేల రూపాయిలు నగదు, ఒక బంగారు గొలుసు ఉన్నట్లు ఆ మహిళ తెలిపింది. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిసిపుటేజ్‌ను పరిశీలించినా ఫలితంలేదు. దీంతో ఆమహిళ కన్నీటి పర్యాంతమైంది.

## 28న ఎస్.కె.ఆర్ లో జాబ్ మేళా

గూడూరు, మార్చి 26 ప్రభాతవార్త : పట్టణంలోని ఎస్.కె.ఆర్ డిగ్రీ కలశాలలో ఈనెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్.కె.ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివ ప్రసాద్ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ సిటిలోని ప్రముఖ టూత్ బ్రష్ కంపెనీ బ్లు ఓషన్ పర్సనల్ అండ్ అలీడ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నేస్తం ఫౌండేషన్ ద్వారా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, డిప్లమో చదివిన వారు అర్హులన్నారు. 350 మందికి ఉద్యోగ అవకాశం కలదు అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఎమ్మెల్సీ బీద రవిచంద్రను సన్మానించిన ఎమ్మెల్యే



గూడూరు, మార్చి 26 ప్రభాతవార్త : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీ బీద రవిచంద్రను, ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఘన స్వాగతం పలికారు. అనంతరం పలువురు నాయ కులు, కార్యకర్తలు బీద రవిచంద్రను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రీవెన్స్ డే నిర్వహించారు. పట్టణ, రూరల్ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని సమస్యలను అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి అప్పటికప్పుడే పరిష్కరించారు ప్రజల సమస్యలను అధికారులతో తొందరగా పరిష్కరించాలని కార్యాల యాలు చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. నియోజకవర్గం పరిధిలోని ఇరిగేషన్, నీటి పారదలశాఖ, తెలుగుగంగ, పంచాయతీ రాజ్‌శాఖ, హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## అక్రమాలు దౌర్జన్యాలు పెరిగాయి : నేదురుమల్లి



వెంకటగిరి, మార్చి 26 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంలో అక్రమాలు దౌర్జన్యాలు పెరిగాయని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు నాలుగు సంవత్సరాలు కాలం పనిచేస్తే చాలు అనుకునే వైసిపి వారిని ఇబ్బంది పెడుతు న్నట్లు తెలిపారు. అధికార పార్టీ వారి ఆదేశాల మేరకు వైసిపి వారిపై అక్రమ కేసులు పెడుతున్నట్లు తెలిపారు. దక్కిలి సర్పంచి గిరిజన మహిళ అయినందున ఆమెపై కార్యదర్శి కృష్ణ చైతన్య ఇబ్బంది పెడుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ కలెక్టర్కు ఫిర్యాదు చేయగా డీఎల్పిఓ విచారణకు వచ్చి తెలుగుదేశం వారిని పక్కన పెట్టకొని విచారించారని తెలిపారు. డిఎల్‌పిఓ ఇలా చేయడం మంచిది కాదని తెలిపారు. మాజీ జెడ్పిటిసి రామచంద్ర నాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు కోటేశ్వర్‌రెడ్డి వీరిని విచారణకు జరిగే అప్పుడు పక్కన పెట్టుకున్నట్లు తెలిపారు. డీఎల్పిఓ వెంకటరమణపై కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఏప్రిల్ నెల 9వతేదీ జరిగే అవిశ్వాస తీర్మానంలో వైసిపి వారు విజయం సాధిస్తారని తెలిపారు.

## తిరుపతివాసికి గ్లోబల్ పీస్ పురస్కారం




తిరుపతి(రవాణా), మార్చి 26 ప్రభాతవార్త: తిరుపతికి చెందిన శోభారాణికి గ్లోబల్ పీస్ పురస్కారం లబించింది. జర్మనీకి చెందిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ 23న పాండిచ్చేరిలో నిర్వహించిన సదస్సులో తిరు పతికి చెందిన మూవీఆర్టిస్ట్, సామాజికవేత్త భక్తుల శోభారాణికి పురస్కారం అందజేశారు. ఆమె సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సినీ,టివి రంగాల్లో నటిగా గుర్తింపు పొందారు. ఆమె చేసిన సామాజిక సేవలకు గుర్తింపుగా గౌరవపురస్కారం అందజేశారు.

## కొలువుదీరిన తల్లి గంగమ్మకు కోటి దండాలు



పుంగనూరు, మార్చి 26 ప్రభాతవార్త : రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే పుంగనూరు శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరలో అమ్మవారు మంగళవారం అర్ధరాత్రి ఆలయంలో కొలువైంది. మంగళవారం ఉదయం నుంచి భక్తుల దర్శనార్థం జమీందారీ ప్యాలెస్‌లోకి వచ్చిన అమ్మవారి విగ్రహాన్ని బుధవారం తెల్లవారుజామున ఒంటి గంటకు భూగర్భ ఆలయంలో కొలువు చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి పుంగనూరు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాదిమంది భక్తులతో జమీందారీ ప్యాలెస్ ప్రాంగణం క్రిక్కిరిసిపోయింది. వేలాది గెరికలతో భక్తులు అమ్మవారికి మొక్కలు తీర్చుకున్నారు. తెలుగుదేశం ఇన్చార్జి చల్లా బాబు, ఈసివై అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్, జనసేన నేత వేణుగోపాల్ రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబీకులతో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు. డీఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు భక్తుల రక్షణ చర్యలు చేపట్టారు.

## నారా భువనేశ్వరికి ఘనస్వాగతం



కుప్పం,మార్చి 26 ప్రభాతవార్త : నాలుగు రోజుల పర్యటన నిమిత్తం కుప్పం విచ్చేసిన సిఎం చం ద్ర బాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి కుప్పంలో ఘనస్వాగతం లభించింది. కర్ణాటక సరిహద్దు బిసానత్తంకు రోడ్డు మార్గంలో నారా భువనమ్మ చేరుకోగా ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, సలహాదారు నరేష్‌చారి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేతలు బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, టిటిడి బోర్డుసభ్యుడు వైద్యం శాంతారాం, మండల పార్టీ అధ్యక్షులు రాజ్‌కుమార్, బాబునాయుడు, విశ్వనాథనాయుడు, మహిళా నేతలు అనసూయ, భాగ్యలక్ష్మి త్రిలోక్, సుగుణమ్మ, పద్మమ్మ, ఇతర నేతలు హారతులతో ఘనస్వాగతం పలికారు.

## 29న తడ మండల సర్వసభ్య సమావేశం

తడ, మార్చి 26 ప్రభాతవార్త: మండల ప్రజా పరిషత్ 15వ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీన ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపిడిఓ నెల్లూరు విజయకుమార్ తెలిపారు. సమావేశంలో ప్రత్యేకించి వేసవి మంచినీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ వారు తీసుకోవాల్సిన చర్యలను గురించి సమీక్ష జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ వారితో, వ్యవసాయ సమస్యలపై ఆ శాఖ వారితో సమీక్షలు ఉంటాయని ఆయన చెప్పారు. మండలంలోని అందరు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని ఎంపిడిఓ కోరారు.

## మూడుకు చేరిన మృతుల సంఖ్య

తడ, మార్చి 26 ప్రభాతవార్త: ఈ నెల 23న తడ మండలం పెరియవట్టు వద్ద కొబ్బరిచెట్టును కారు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన మరొకరు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. చెన్నై తాంబరం నుంచి ఉబ్బలమడుగుకు విహారయాత్రకు వెళుతున్న యువతీ యువకులు ఈ ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదం జరిగిన రోజు ఇద్దరు మృతిచెందగా, చెన్నై స్టాన్లీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో మాదేష్ (21) మృతిచెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఇప్పటికీ అక్కడ మరికొందరు విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ కొండపనాయుడు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రవిచంద్రకు ఎమ్మెల్సి రావడం హర్షణీయం

వెంకటగిరిరూరల్, మార్చి 26ప్రభాతవార్త: తెలుగు దేశం పార్టీ ఎప్పుడు బిసిలకు పెద్ద పీఠ వేస్తుందని టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిల్లు సిసింద్రి యాదవ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లడుతూ రెండవ సారి ఎమ్మెల్సీగా బీద రవిచంద్ర యాదవ్‌కు అవకాశం రావడం సంతోషదాయకం అన్నారు. టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిల్లు సిసింద్రి యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు.

## ఎన్‌బికెఆర్‌లో యాక్సిన్-2025 పోస్టర్ ఆవిష్కరణ



కోట, మార్చి 26 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో యాక్సిన్-2025 జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ సదస్సును ఏప్రిల్ 12న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో రాష్ట్రంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని సాంకేతిక అంశాలపై చర్చిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ జి.హరినాథరెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సులో పాల్గొని పేపర్ మరియు పోస్టర్ ప్రజంటేషన్, వినూత్న ప్రాజెక్టుల ప్రదర్శనలలో తమ ప్రతిభను ప్రదర్శిం చేందుకు చక్కటి అవకాశం అన్నారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు మహేష్‌రెడ్డి, సుప్రతిక, షఠిం తదితరులు పాల్గొన్నారు.

## జాతర భక్తులకు అంబలి చలివేంద్రాలు ఏర్పాటు



కోట,మార్చి 26 ప్రభాతవార్త : చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో జరిగే ముత్యాలమ్మ జాతరకు వివిధ ప్రాంతాలను నుంచి భక్తులు వస్తున్న వారికి కోటలో తెదేపా జిల్లా బిసి సెల్ ప్రదాన కార్యదర్శి, తీగల సురేష్‌బాబు ఆధ్వర్యంలో అంబలి చల్లి వేంద్రాలను ఏర్పాటు చేశారు.జాతరకు వేళ్లే భక్తులకు దగ్గండి అంబలిని పంపిణీ చేశారు. తీగల సురేష్‌బాబు మాట్లాడుతూ నీళ్లల్లో చల్లదనం... మనుసుల్లో మంచి తనం అవసరమన్నారు. అదే క్రమంలో విద్యా నగర్‌లోని స్టేట్ బ్యాంక్ వద్ద వేమూ ప్రభాకర్ జ్ఞాపకార్థం చల్లివేద్రం ఏర్పాటు చేసి భక్తులకు పశమనం కలగించారు.మరో రెండు రోజుల పాటు ఉథయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అంబలి చలివేంద్రాలు నిర్వహిం చడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, లత రత్నాకర్, రాలీలావతి, ఆనంద, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీ ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చు : ఎంపీడీవో



బాలాయపల్లి, మార్చి 26 ప్రభాతవార్త : వెలుగు కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులకు, పంచాయతీ కార్యదర్శులకు ఫిజియోథెరపీపై వైద్యాధికారులు అవగాహన కల్పించారు. ఫిజియోథెరపీ ఎలా చేసుకోవాలో శిక్షణలో పలు సూచనలు ఇచ్చారు. హైదరాబాదులోని నిజాం ఇన్స్టిట్యూట్ వైద్యాధికారులు డాక్టర్ రమేష్, డాక్టర్ సంతోష్ కుమార్లు ఫిజియోథెరపీ పై అవగాహన కల్పించారు. నేటి జీవనశైలి విధానం, పెరుగుతున్న మానసిక, ఉద్యోగ ఒత్తిళ్లు తట్టుకునేందుకు ఫిజియోథెరపీ ఉపకరిస్తుం దని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో డీజే వినీల్‌కుమార్, వైద్య సిబ్బందిలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంను గమనిస్తున్న ప్రజలు



వాకాడు, మార్చి 26 ప్రభాతవార్త : అబద్ధపు హామీలతో అధికార్ర చేపట్టిన కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాలను తొంగలో తొక్కేస్తూ అన్ని గమనిస్తున్నా ప్రజలే రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పే రోజులు వస్తాయని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ ఆఫ్ మాజీ చైర్మన్, వెంకటగిరి నియోజవర్గ ఇన్చార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శిం చారు. బుధవారం వాకాడు నేదురుమల్లి నివాసంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వైకాపా సీనియర్ నాయకులు, కార్యకర్తలు రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నాయకులు సూచనలు సలహాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చేసిందని, ప్రజలు చూస్తూ ఊరుకోరని ప్రజలు తిరగబడే సమయం వచ్చిందన్నారు.

# వేదపాఠశాల ఏర్పాటుపై కంచిస్వామి సుముఖత

**-పుణ్యక్షేత్రంలో వేదపాఠశాల, పుణ్యక్షేత్రాల అభివృద్ధిపై ఎంఎల్ఏ ప్రతిపాదనలు**



శ్రీకాళహస్తి,మార్చి 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వేదపాఠశాలను అన్ని సదుపాయాలతో ఏర్పాటుకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ప్రతిపాదించారు. ఈ మేరకు ఆరురోజుల పర్యటనకు దక్షిణ కైలాసానికి వచ్చిన కంచికామకోటి పీఠాధిపతి శంకరవిజయేంద్ర సరస్వతితో చర్చించారు. స్వామి గంగాసదన్‌లో పూజలు,హోమాలు నిర్వహిస్తుండగా శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డి ఆయన అనుచరులతో కలసి స్వామి ఆశీర్వచనాలు పొందారు. సుమారు గంట పాటు స్వామితో పలు అంశాలపై సుధీర్‌రెడ్డి చర్చించారు. ఇక్కడకు వచ్చే భక్తులకు సదుపాయాలతో పాటు వేదాలతోప ్రనీతమయ్యే ప్రకృతిని ఆస్వాదిస్తూ వేదపఠనంతో ఈ ప్రాంతాలు సుభిక్షంగా ఉండాలని తాను యోచిస్తున్నట్లు వివరించారు. ఇందుకు గాను శ్రీకాళహస్తీశ్వ రాలయం సారధ్యంలో వేదపాఠశాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయ పడుతున్నట్లు ఎంఎల్ఏ స్వామికి సూచించారు. ఎంఎల్ఏ ప్రతిపాదనకు కంచిస్వామి అభినందిస్తూ యువకుడైనా వేదాలపట్ల ఉన్న గుర్తింపును అభినందించారు. ఈ మేరకు దేవాదాయశాఖకు ప్రతిపాదన పంపనున్నట్లు వివరించారు. స్వామి స్పందిస్తూ 'వేద పాఠశాల' ఏర్పాటుకు సంబంధించిన సమాచారాన్ని స్వామి ఎంఎల్ఏకు అందించారు. కాబట్టి ఇక్కడే వేదపాఠశాలను ఏర్పాటు చేస్తే వేదపండితులు శిక్షణ పొందుతారన్నారు. పవిత్ర దివ్యక్షేత్రంలో కైలాసగిరి పర్వత పంక్తుల్లో ఆహ్లాదకరవాతావరణంలో 'వేద పాఠశాల ఏర్పాటు శుభ సూచకమని కంచి స్వామి అభిప్రాయపడ్డారు.

**గుడిమల్లం,శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధికి ప్రతిపాదనలు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఆధ్యాత్మిక దివ్యక్షేత్రంగా ధార్మిక కేంద్రంగా విరాజిల్లుతుందని ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదనలను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కంచిస్వామికి వివరించారు. చక్కటి ప్రణాళికలని స్వామి అభినందించారు. గుడిమల్లంను శ్రీకాళహస్తికి అనుబంధంగా తీసుకొని అభివృద్ధి పరచుటకు సంబంధించిన అంశాలను స్వామికి వివరించగా తథాస్తు అన్నారు. గుడిమల్లం అభివృద్ధికి సంబంధించి పురావస్తు శాఖ,కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల సేకరణకు సంబంధించి స్వామికి వివరించారు. పర్యాటక శాఖలో ప్రతిపాదనలను కూడా స్వామికి వివరించారు. ఇక శ్రీకాళహస్తీశ్వ రాలయానికి వచ్చే భక్తులకు సకల సదుపాయాలతోపాటు చక్కటి ఆధ్యాత్మిక చింతన కోసం మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయనున్నట్లు స్వామికి వివరించగా మంచి ఆలోచనలని అభినందించారు. ఎంఎల్ఏతో పాటు మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు, జడ్‌పిటిసి సుబ్బారెడ్డి,మాజీ పాల సరఫరా సంఘ చైర్మెన్ రావిళ్ళ మునిరాజానాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, డాక్టర్ కృష్ణ,మాజీ కౌన్సిలర్ దుర్గా ప్రసాద్,అయ్యప్ప హరి,వేలు,కన్నలి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఆర్ కాన్క్లేవ్‌కు స్పందన

తిరుపతి కలెక్టరేట్, మార్చి 26 ప్రభాతవార్త : పరిశ్రమ–అకాడమీ అనుసంధానం కోసం తిరుపతి జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో బుధవారం జరిగిన హెచ్‌ఆర్ కాన్క్లేవ్ కార్యక్రమానికి స్పందన లభించింది. సంకల్ప పథకంలో భాగంగా ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఏపీఐఐసీ వారి ఆధ్వర్యంలో జేసీ శుభం బన్సల్ అధ్యక్షతన ఈ హెచ్‌ఆర్ కాన్క్లేవ్ నిర్వహించడం జరిగింది. ఈ కాన్క్లేవ్‌లో ప్రముఖ కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు, పరిశ్రమల నిపుణులు, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ అకాడెమియా అనుసంధానం, ఇంటర్న్‌షిప్, అప్రెంటీస్ ప్రోగ్రామ్, రాబోయే మూడేళ్ళ మ్యాన్ పవర్ అవసరాలు వంటి ముఖ్య అంశాలపై జేసీ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ , జిల్లా స్కిల్ కమిటీ కన్వీనర్ టీఎన్ శోభన్‌బాబు, డీఐసీ జీఎం పి. సుధాకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్‌రెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం,జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి వెంకటరమణ, సంబంధిత అధికారులతో చర్చించారు. ఇతర పరిశ్రమల సంస్థ ప్రతినిధులు, హెచ్‌ఆర్ ప్రతినిధులు, అకాడమిక్ ఇనిస్టిట్యూట్ సంబంధించి ఐటీఐ పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, ప్రిన్సిపాల్స్ అలాగే యూనివర్శిటీ నుంచి ప్రొఫెసర్, డీన్, హెచ్‌వోడీలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనే విద్యార్థుల కర్తవ్యం




తిరుపతి విద్య, మార్చి 26 ప్రభాతవార్త : విద్యార్థి దశ కీలకమైందని,లక్ష్య సాధనే కర్తవ్యంగా శ్రమించా లని ఎస్వీయూ వీసీసీహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృ వర్సిటీలో బుధవారం జరిగిన హాస్టల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని శ్రమిస్తారో వారిని విజయం వరిస్తుందన్నారు. విద్యార్థులు భావిభారత సమాజానికి నిర్మాతలుగా రాణించాలని సూచించారు. ఎన్ఎస్ఈ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా హాస్టల్ వసతి,క్రీడావసతి, శారీరకమానసిక వికాసానికి సంబంధించినటువంటి విశేష కార్యక్రమాలు వర్సిటీలో అందుబాటులో ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ వెంకట్రావు,చీఫ్‌వార్డెన్ పరిమిత పండ,వార్డెన్స్ జ్యోతి,లీనాచంద్ర, బుల్టిదాస్,ప్రదీప్ కుమార్ బాగ్,సోమనాథ్ దాస్, జ్ఞాన రంజన పండ, లక్ష్మీనారాయణ, ఉదయన హెగ్డే,ఆలోక్ మండల్,హాస్టల్ మేనేజర్ ఫణివర్మ, హాస్టల్ సిబ్బంది, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు తవణంపల్లె నూతన ఎంపీపీ ఎన్నిక

తవణంపల్లె, మార్చి 26 ప్రభాతవార్త: మండల పరిషత్ నూతన అధ్యక్షుడి ఎన్నిక గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరుగనుంది. మండల పరిషత్ అధ్యక్షురాలిగా పనిచేస్తున్న గోవిందరెడ్డిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు పార్టీలో కుదిరిన అంతర్గత ఒప్పందం మేరకు ఎంపీపీ పదవికి రాజీనామా చేయడంతో గత ఏప్రిల్ 22న వైస్ ఎంపీపీ-2 మల్లకుంట ఎంపీటిసి సభ్యుడు పట్నం ప్రతాప్‌రెడ్డి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఎన్నికల రెగ్యులర్ ఎంపీపీ ఎన్నిక కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈమేరకు బుధవారం ఉదయం 10 గంటలక స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో నూతన ఎంపీపీ ఎన్నిక జరుగనుంది, ఈమేరకు ఎన్నికల కమీషన్ ఎన్నికల అధికారిగా చిత్తూరు ఆర్డీఓను నియమిం చింది. దీనితో ఆయన సమక్షంలో ఎన్నిక జరుగనున్నట్లు ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై చిరంజీవి తెలిపారు. మొత్తం 15 ఎంపీటీసీ సెగ్మెంట్‌లు వుండగా గత ఎన్నికల్లో 14 స్థానాలను వైకాపా గెలుపొందగా ఒక్క స్థానంలో మాత్రం టీడీపీ గెలుపొందింది.

## నేడు సదుం ఎంపీపీ ఎన్నిక

సదుం, మార్చి 26 ప్రభాతవార్త : సదుం మండల పరిషత్ అధ్యక్ష ఎంపిక గురువారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో హరిబాబు తెలిపారు. ఇక్కడ ఎంపీపీగా ఉన్న బి. ఎల్లప్ప ఇటీవల మృతి చెందారు. ఆయన స్థానంలో మూడు నెలలుగా ఇన్చార్జ్ ఎంపీపీగా వైస్ ఎంపీపీ ధనంజయ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల సంఘం ఎంపీపీలను ఎన్నిక చేయడానికి నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకోసం మండల సమావేశ భవనము నందు ప్రత్యేక సమావేశం జరుగునని తెలియజేశారు. ఈ ప్రత్యేక సమావేశమునకు ఓటు హక్కు కలిగిన అందరు ఎం.పి.టి.సిలను, శాసనసభ్యులు పి.రామచంద్రారెడ్డిని రాజంపేట, పార్లమెంటు సభ్యులు వేంకట మిథున్ రెడ్డిని, జెడ్.పి. టిసిటి సోమశేఖర్‌రెడ్డిని సమావేశం హాజరు కమ్మని నోటీసులు పంపారు. సదుం ఎంపీపీ పదవి ఎస్సి సామాజి వర్గానికి కేటాయించడంతో అప్పట్లో చెరుకువారిపల్లె ఎంపీటీసీగా గెలిచిన ఎల్లప్పను ఎంపీపీగా పెట్టారు. ప్రస్తుతం ఎస్సీ సామాజిక వర్గంకు చెందిన పాలమంద ఎంపీటీసీ మాధవి మాత్రమే ఉన్నారు. దీనితో పాటు అందరూ ఎంపీటీసీలు వైకాపాకు చెందిన వారే కావడంతో ఆమె ఎంపిక లాంచనం కానుంది.

## నల్లగంగమ్మ అమ్మవారికి సారె సమర్పణ



శ్రీకాళహస్తి, మార్చి 26 ప్రభాతవార్త: బహదూరుపేటలో మహిమాన్వితంగా వెలసిన నల్లగంగమ్మ అమ్మవారికి జాతర సందర్భంగా మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూధన్‌రెడ్డి మరియు దేవస్థాన మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు సారెను సమర్పిం చారు. అనంతరం నల్లగంగమ్మ అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కంటా ఉదయ్‌కుమార్, దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మున్నారాయల్, శ్రీవారి సురేష్, డాక్టర్ శంకర్, పత్తిమణి, మొగరాల గణేష్, గోపి, రాజ, నవీన్, ప్రసాద్, ఈశ్వర్, సాయి మరియు నల్లగంగమ్మ ఆలయ కమిటీ సభ్యులుభక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు



పుత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చె న్నాయుడు జన్మదిన వేడుకలు బుధవారం పట్టణంలోని ఎంబీ రోడ్డులో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి విజయబాబు కార్యాల యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ధనపాల్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పరందామ్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు విజయశేఖర్ నాయుడు, సూపర్‌బజారు చైర్మన్ చంద్ర యాదవ్, మాజీ ఎంపీటీసీ పాండు రంగయ్య, నాయకులు దాసరి విజయచౌదరి, మధుసూదన్‌రాజు, కుమార్‌రెడ్డి, అజయ్‌చౌదరి,పూల సుధ, రమేష్‌నాయుడు, మునిరత్నం, జగదీష్, మణికంఠ, సారథి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ లో శరవేగంగా ఎమ్మారై యూనిట్



రేణిగుంట ఏప్రిల్ 26 ప్రభాతవార్త : రేణిగుంట విమానాశ్రయం వెళ్లే మార్గంలో ఉన్న శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ ఆసుపత్రి నందు ఎం.ఆర్.ఐ యూనిట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మెడికల్‌కాలేజీ డీన్ డాక్టర్ శివానంద్ దొడ్డమణి, ఆసుపత్రి జేఈవో డాక్టర్ నవీన్ కుమార్, ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఫిజీషియన్ డాక్టర్ సందీప్‌కుమార్ అన్నారు. బుధవారం వారు ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆసుపత్రి సీఈవో పాణిగ్రాహి ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాలు సమకూర్చడానికి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. ఇప్పటికే ఆసుపత్రిలో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో శాస్త్ర చికిత్స చేసే ఆపరేషన్ థియేటర్లు, వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విషకీటకాల కాటుకు వైద్యం చేస్తున్నామన్నారు. ఆసుపత్రిలో ఇప్పటికే సిటీ స్కాన్, ఎక్స్‌రే, ఈసీజీలతో పాటు అన్ని రకాల రక్త పరీక్షల చేసే ల్యాబ్లు, టెక్నీషియన్లు ఉన్నాయన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. డెంగ్యూ జ్వరానికి ప్రత్యేకంగా వైద్య చికిత్సలు చేస్తున్నామన్నారు. అత్యవసర వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసుపత్రి మెడికల్ మందులు కొన్నవారికి మందులను బట్టి 10 నుండి 40శాతం మందులపై డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాహుల్, వైద్య ఆరోగ్యశ్రీ ఇంచార్జ్ డాక్టర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.